epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

సంపుటి : 19 సంచిక : 70 | 23-05-2026 శనివారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 8 వెల : రూ.1.00





# గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలి



## వ్యవసాయాధార పరిశ్రమలకు రుణాలు పెంచాలి

## సంప్రదాయ వ్యవసాయ రునాలకే పరిమితం కారాదు

## బ్యాంకర్ల సమావేశంలో మంత్రి తుమ్మల సూచన

తెలంగాణ రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో బ్యాంకులు చురుకైన భాగస్వాములు కావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రజా భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ..




బ్యాంకర్లు కేవలం సాంప్రదాయ పంట రుణాలకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి రుణాల పంపిణీని భారీగా పెంచాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గ్రామీణ తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ఇదే సరైన సమయమని, ఈ అవకాశాన్ని బ్యాంకులు ఉపయోగించుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

వార్త 2లో




# భూదోపిడీ మీద ఉన్న శ్రద్ధ.. రైతన్నలపై ఏదీ

2 లో..

## భూ ఆక్రమణలపై ఎందుకు స్పందించడ లేదు

## సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ కెటిఆర్

కాంగ్రెస్ ప్రభుత్వానికి భూముల దోపడీ మీద ఉన్న శ్రద్ధ దేశానికి అన్నంపెట్టే రైతులపై లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. మొన్నటికి మొన్న రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి భూ హారతి ద్వారా కేసముద్రంలో అసైన్డ్ పట్టాలు ఆక్రమించాడని ఆరోపించారు.



# వివాదంగా త్రిభాషా విధానం

## మూడు భాషలు తప్పనిసరి చేయడంపై సవాల్

## సుప్రీంలో ప్రజాప్రయోజన వాజ్యం దాఖలు

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ తొమ్మిదో తరగతి విద్యార్థులకు మూడు భాషల బోధనను తప్పనిసరి చేస్తూ తీసుకువచ్చిన నూతన విద్యా విధానం ఇప్పుడు న్యాయ వివాదానికి దారితీసింది. బోర్డు తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల తరఫున దాఖలైన ఈ పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం విచారణకు స్వీకరించింది.

2

# ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ వ్యాపారం

## బిఆర్ఎస్ రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తాం

## మాజీమంత్రి హరీష్ రావు హెచ్చరిక



2

బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న మాజీ మంత్రి.. కాంగ్రెస్ సర్కార్ చేపడుతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. ఫార్మా సిటీకి మాత్రమే కేంద్ర పర్యావరణశాఖ అనుమతి ఇచ్చిందని తెలిపారు. డీవియేషన్ ఉంటే రైతుల భూములు వెనక్కి ఇవ్వాలని చట్టంలో ఉందని వెల్లడించారు. ఫార్మా సిటీని కొనసాగిస్తామని ఓ వైపు కోర్టుకు చెబుతూ.. రేవంత్ ప్రభుత్వం జిమ్మిక్కు చేస్తోందని విమర్శించారు.



2

# నీట్ పేపర్ లీకేజీలో దర్యాప్తు ముమ్మరం లాతూర్‌కు చెందిన డాక్టర్ అరెస్ట్

# తెలంగాణ విద్యా రంగంలో సంచలనం

2




## విద్యా కమిషన్ చైర్మన్ పదవికి ఆకునూరి మురళి రాజీనామా

## విద్యారంగంలో అనేక మార్పులు సూచిస్తూ నివేదిక

## అంతలోనే రాజీనామా

## చేయడంపై సర్వత్రా చర్చ




2

# పదేపదే కొందరికే రిజర్వేషన్లు ఇస్తే ఎలా

రిజర్వేషన్లపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు చేసింది. కొందరే వీటిని పదేపదే అనుభవించడం ద్వారా మిగతావారికి అడ్డుపడుతున్నారని అభిప్రాయ పడింది.


# కిడ్నీ మార్పిడి చికిత్సల్లో నిమ్స్ ఘనత

## వైద్య బృందాన్ని అభినందించిన సిఎం రేవంత్



హైదరాబాద్,

కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్‌లో అరుదైన మైలురాయిని అందుకున్న నిమ్స్ వైద్య బృందానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఔఎ+ూ) కిడ్నీ మార్పిడి చికిత్సల్లో దేశంలోనే అరుదైన రికార్డు నమోదు చేసింది. నిమ్స్ యూరాలజీ విభాగం ఇప్పటివరకు 2,000 కిడ్నీ ట్రాన్స్‌ఎ÷-లాంట్స్ పూర్తి చేసింది. కిడ్నీ మార్పిడిలో దక్షిణ భారత దేశంలో నిమ్స్ నంబర్ వన్‌గా నిలిచింది. దేశంలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్‌లో గుజరాత్‌లోని ఐకేడీఆర్‌సీ మొదటి స్థానంలో ఉంది. రెండో స్థానంలో లూథియానా క్రిస్టియన్ కాలేజీలో ఉండగా.. నిమ్స్ మూడో స్థానంలో నిలిచింది. ఈ అరుదైన మైలురాయిని సాధించి కిడ్నీ బాధితులకు విశేష సేవలు అందించిన నిమ్స్ వైద్య బృందానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ 2,000 మందిలో 1,900 మంది అంటే 95? మంది రాజీవ్ ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా కిడ్నీ మార్పిడి చేయించుకోవటం విశేషం. 2023 జనవరి నుంచి గడిచిన మూడేళ్ల నాలుగు నెలల్లోనే.. 500 కిడ్నీ మార్పిడిలు చేసి నిమ్స్ రికార్డు నెలకొల్పింది.




2

# కేంద్రానికి ఆర్‌బిఐ శుభవార్త

# భూదోపిడీ మీద ఉన్న శ్రద్ధ.. రైతన్నలపై ఏదీ

## భూ ఆక్రమణలపై ఎందుకు స్పందించడ లేదు

## సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ కెటిఆర్

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

కాంగ్రెస్ ప్రభుత్వానికి భూముల దోపడీ మీద ఉన్న శ్రద్ధ దేశానికి అన్నంపెట్టే రైతులపై లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. మొన్నటికి మొన్న రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి భూ హారతి ద్వారా కేసముద్రంలో అసైన్డ్ పట్టాలు ఆక్రమించాడని ఆరోపించారు. శంషాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుచరులు 90 ఎకరాల సీలింగ్ భూమిని తహసీల్దార్, కలెక్టర్ స్థాయిలో ఉత్తర్వులు ఇచ్చి వేల కోట్ల భూమిని దోపిడీ ఎలా చేశారో ఏసీబీ దాడిలో దొరికారు. అయినా కూడా ఇలాంటి వాటిపై రేవంత్ రెడ్డి దృష్టి పెట్టడని విమర్శించారు. ధాన్యం




కొనుగోళ్లు చేపట్టక రైతులు పిట్టల్లా రాలిపోతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం ధాన్యం కొనుగోళ్లపై చేపట్టిన సమీక్ష తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. డబ్బు సంచుల మీద ఉన్న శ్రద్ధ ధాన్యం సంచుల సేకరణలో లేదని మండిపడ్డారు. తెలంగాణ వ్యాప్తంగా వడ్లు కొనక 45 రోజుల్లో 10 మంది చనిపోతే ఒక్కరు కూడా చనిపోలేదని సివిల్ సప్లైస్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సిగ్గు లేకుండా అబద్ధాలు ఆడుతున్నారు. మంత్రి సొంత జిల్లాలో మహ్మద్ నసీరుద్దీన్ అనే రైతుల ధాన్యం రాశిపైనే మృతి చెందాడన్నారు. జనగామ జిల్లా ఏనెబావిలో కాంటాలు పెట్టడంలేదని కాంగ్రెస్ కార్యకర్తలే ఆందోళన చేరన్నారు. ఇనేక సంఘటనలు జరిగాయన్నారు. ఓ కాంగ్రెస్ నాయకుడు మా పార్టీ నాయకుడికి ఫోన్ చేసి, ధాన్యం ప్రభుత్వం కొనుడు ఎందయ్యా, మాకు లేని పని పెట్టిండు మీ కేసీఆర్ అని చెప్తున్నాడు ఓ కాంగ్రెస్ నాయకుడు మా పార్టీ నాయకుడికి ఫోన్ చేసి ధాన్యం ప్రభుత్వం కొనుడు ఎందయ్యా, మాకు లేని పని పెట్టిండు మీ కేసీఆర్ అని చెప్తున్నాడు. రాష్ట్రంలో ఇప్పటివరకు 35? ధాన్యం కూడా కొనుగోలు చేయలేదన్నారు. కానీ రేవంత్ రెడ్డి, అతని మంత్రులు 80? కొనుగోలు చేశామని అబద్ధాలు చెప్తున్నారని మండిపడ్డారు. రైతుల ఇబ్బందుల మీద అవగాహన లేకుండా రేవంత్ రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఊరికైనా పోదాం.. ఎక్కడన్నా మీరు చెప్పినట్లు 80 శాతం పంట కొనుగోళ్లు చేశారని నిరూపిస్తే మేము ఏ శిక్షకైనా సిద్ధమని రేవంత్ రెడ్డికి కేటీఆర్ ఛాలెంజ్ విసిరారు. రేవంత్‌లో అగౌరవంగా మాట్లాడే భాష తనకు రాదన్నారు.

# ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ వ్యాపారం

## బిఆర్ఎస్ రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తాం

## మాజీమంత్రి హరీష్ రావు హెచ్చరిక

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న మాజీ మంత్రి.. కాంగ్రెస్ సర్కార్ చేపడుతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. ఫార్మా సిటీకి మాత్రమే కేంద్ర పర్యావరణశాఖ అనుమతి ఇచ్చిందని తెలిపారు. డీవియేషన్ ఉంటే రైతుల భూములు వెనక్కి ఇవ్వాలని చట్టంలో ఉందని వెల్లడించారు. ఫార్మా సిటీని కొనసాగిస్తామని ఓ వైపు కోర్టుకు చెబుతూ.. రేవంత్ ప్రభుత్వం జిమ్మిక్కు చేస్తోందని విమర్శించారు. ఫార్మా సిటీ వస్తే దానికి అనుబంధంగా కనీస సౌకర్యాలు ఎడ్యుకేషన్, హౌసింగ్ రావాలని ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. 75శాతం ఫార్మా సిటీ ఉండి... మిగతా 25శాతం మిగతావి ఉండాలని అన్నారు. కానీ..75శాతం మిగతా వ్యాపారం చేసి.. కేవలం 25శాతమే ఫార్మా వచ్చేలా చేస్తున్నారని విమర్శించారు. ఇది చట్ట ప్రకారం చెల్లదన్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో కాంగ్రెస్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని మాజీ మంత్రి ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని.. ఫార్మా సిటీని రీస్టోర్ చేస్తామని స్పష్టం చేశారు. 'ఇది నా మాట కాదు.. పార్లమెంట్ చట్టం. ఫార్మా సిటీ వస్తే లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తాయని మేము ప్రారంభించాం. మన దగ్గర నుంచి ఒక్క ఫార్మా కంపెనీ బయటికి వెళ్లొద్దని చేశాం. ఇప్పటికే రెండున్నరేళ్లు గడిచిపోయింది. లాస్ట్ వన్ ఇయర్ ఎలక్షన్ ఉంటుంది. రేవంత్ సర్కార్ ఏమీ చేయలేదు. భూములు పంచి పెడితే బ్యాక్ ఎండ్ ఏదో లబ్ది పొందాలని ఎ÷--÷-లాన్ చేశారు. ఫార్మా సిటీ అభివృద్ధి చెందితే బీఆర్ఎస్‌కు పేరు వస్తుందని ఇలా చేశారు. ఉన్నది ఉన్నట్టుగా అక్కడ ఫార్మా సిటీనే వస్తుంది' అని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# వివాదంగా త్రిభాషా విధానం

## మూడు భాషలు తప్పనిసరి చేయడంపై సవాల్

## సుప్రీంలో ప్రజాప్రయోజన వాజ్యం దాఖలు

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ తొమ్మిదో తరగతి విద్యార్థులకు మూడు భాషల బోధనను తప్పనిసరి చేస్తూ తీసుకువచ్చిన నూతన విద్యా విధానం ఇప్పుడు న్యాయ వివాదానికి దారితీసింది. బోర్డు తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల తరఫున దాఖలైన ఈ పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. ఈ వ్యవహారాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ప్రస్తావించారు. విద్యా సంవత్సరం మధ్యలో అకస్మాత్తుగా తొమ్మిదో తరగతి నుంచి మూడు భాషలను తప్పనిసరి చేయడం వల్ల విద్యార్థులపై తీవ్రమైన మానసిక, విద్యాపరమైన భారం పడుతుందని రోహత్గి కోర్టుకు వివరించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న విద్యా విధానానికి ఇది పూర్తిగా భిన్నంగా ఉందని, దీనివల్ల అటు విద్యార్థుల్లో, ఇటు విద్యాసంస్థల్లో తీవ్ర గందరగోళం నెలకొందని ఆయన పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై త్వరితగతిన విచారణ జరపాలని ఆయన ధర్మాసనాన్ని అభ్యర్థించారు. జాతీయ విద్యా విధానం (ఔఇఖ) సిఫార్సుల మేరకు సీబీఎస్‌ఈ విద్యా చట్రంలో మార్పులు చేస్తూ,9, 10 తరగతుల్లో విద్యార్థులు కచ్చితంగా మూడు భాషలను అందులో రెండు భారతీయ భాషలను చదవాలనే నిబంధనను తీసుకు వచ్చింది. అయితే, తగిన ముందస్తు ప్రణాళిక లేకుండా, కోర్సుల మధ్యలో ఈ నిబంధనను రుద్దడం సమంజసం కాదని పిటిషనర్లు వాదిస్తున్నారు. ఈ వాదనలను పరిశీలించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం, ఈ పిటిషన్‌పై వచ్చే వారం సమగ్ర విచారణ జరిపేందుకు అంగీకారం తెలిపింది. ఈ విచారణపై దేశవ్యాప్తంగా ఉన్న సీబీఎస్‌ఈ పాఠశాలలు, విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఉత్కంఠ నెలకొంది.

# గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలి

## వ్యవసాయాధార పరిశ్రమలకు రుణాలు పెంచాలి

## సంప్రదాయ వ్యవసాయ రునాలకే పరిమితం కారాదు

## బ్యాంకర్ల సమావేశంలో మంత్రి తుమ్మల సూచన

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో బ్యాంకులు చురుకైన భాగస్వాములు కావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రజా భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. బ్యాంకర్లు కేవలం సాంప్రదాయ పంట రుణాలకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి రుణాల పంపిణీని భారీగా పెంచాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గ్రామీణ తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ఇదే సరైన సమయమని, ఈ అవకాశాన్ని బ్యాంకులు ఉపయోగించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. తెలంగాణలో క్రెడిట్-డిపాజిట్ నిష్పత్తి రికార్డు స్థాయిలో 130.78 శాతం నమోదు కావడం గొప్ప విశేషం అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో బ్యాంక్ డిపాజిట్లు రూ.9.43 లక్షల కోట్లుగా ఉంటే, అడ్వాన్సులు (రుణాలు) రూ.12.33 లక్షల కోట్లకు చేరాయి. వ్యవసాయ రంగానికి రుణాల



పంపిణీలో రాష్ట్రం అద్భుతమైన ప్రగతిని సాధించింది. నిర్ణీత లక్ష్యం కంటే ఎక్కువగా 102 శాతం ప్రగతిని నమోదు చేయడం హర్షణీయం. రాష్ట్రంలో పంట రుణాల పంపిణీ రూ.75,486 కోట్లకు చేరిందని, వ్యవసాయ రంగానికి మొత్తంగా రూ.1.68 లక్షల కోట్ల రుణాలను బ్యాంకులు అందజేశాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ కార్యక్రమం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో రుణ సంస్కృతి తిరిగి పునరుద్ధరించబడింది. ప్రభుత్వ నిర్ణయాల వల్ల బ్యాంకులలో వ్యవసాయ నిరర్థక ఆస్తులు 5.23 శాతం నుంచి 4.71 శాతానికి తగ్గాయి. తెలంగాణలో ఉద్యానవన రంగంతో పాటు ఆయిల్ పామ్ సాగుకు అపారమైన అవకాశాలు ఉన్నాయని మంత్రి అన్నారు. ఈ రంగాలకు బ్యాంకులు పెద్దపీట వేయాలి. పంట నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలు, సైలోల నిర్మాణానికి బ్యాంకులు ఉదారంగా రుణాలు ఇవ్వాలి. అలాగే రాష్ట్రంలో ఉన్న దాదాపు వెయ్యి రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు తగిన ఆర్థిక మద్దతు అందించాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉంది. వ్యవసాయాన్ని ఆధునికీకరించేందుకు, యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు గానూ ప్రభుత్వం రూ.147.91 కోట్ల బ్జడెట్‌ను కేటాయించింది. కౌలు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో పంట రుణాలు అందేలా బ్యాంకులు బాధ్యత తీసుకోవాలి. వీటితో పాటూ పర్యావరణ హితమైన సోలార్ వ్యవసాయం, మైక్రో ఇరిగేషన్ పద్ధతులకు రుణ సదుపాయాన్ని గణనీయంగా పెంచాలని మంత్రి తెలిపారు.

# పదేపదే కొందరికే రిజర్వేషన్లు ఇస్తే ఎలా

## మిగతా వారికి కూడా ఈప్రయోజనం అందవద్దా

## కొందరికే రిజర్వేషన్లు దక్కితే మిగతా ప్రజలు ఏం కాను

## ఇలా అయితే దేశంలో రిజర్వేషన్ల నుంచి బయటపడేనా

## ఐఎఎస్ తల్లిదండ్రుల పిల్లలకు రిజర్వేషన్లు అవసరమా

## సుప్రీం ధర్మాసనం సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

రిజర్వేషన్లపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు చేసింది. కొందరే వీటిని పదేపదే అనుభవించడం ద్వారా మిగతావారికి అడ్డుపడుతున్నారని అభిప్రాయపడింది. గతంలో సిజెఐగా పనిచేసిన బిఆర్ గవాయ్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. తాజాగా ఇప్పుడు సుప్రీం ధర్మాసనం కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. వెనుకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన కుటుంబాల పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలను కొనసాగించాలని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఉన్నత స్థితికి చేరుకున్న కుటుంబాలు పదేపదే రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడంపై ఆందోళన వ్యక్తం చేసింది.దేశంలో రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు.. తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయిలో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకని అత్యున్నత న్యాయస్థానం సంచలన ప్రశ్నలు సంధించింది. వెనుకబడిన వర్గాల్లోని 'క్రీమీలేయర్' పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారత ద్వారా సమాజంలో ఒక స్థాయి లభిస్తుందని పేర్కొన్నారు. 'రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, మళ్లీ వారి పిల్లల కోసం కోటాను ఆశించడం సరికాదు. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేం. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉందని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండవచ్చని.. కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం పొంది తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుందని, ఇక్కడ ఒక సమతుల్యత అవసరమని కోర్టు స్పష్టం చేసింది. ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే అన్ని అవకాశాలను చేజిక్కించు కుంటే, అదే వర్గంలోని అత్యంత వెనుకబడిన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలో కిందిస్థాయిలో ఉన్న చివరి వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుతం ఓబీసీలకే పరిమితమైన 'క్రీమీ లేయర్' నిబంధనలను, మరింత శాస్త్రీయంగా అమలు చేయడంపై న్యాయస్థానం దృష్టి సారించింది. 1992 నాటి చారిత్రాత్మక 'ఇంద్ర సాహ్ని' కేసులో సుప్రీంకోర్టు ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లను సమర్థిస్తూనే, వారిలో 'క్రీమీలేయర్' వర్గాలను మినహాయించాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం వార్షిక ఆదాయం రూ. 8 లక్షలు దాటిన వారితో పాటు.. ఉన్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు, ఐఏఎస్, ఐపీఎస్ వంటి సీనియర్ బ్యూరోక్రాట్లు, మిలిటరీలో టాప్ ఆఫీసర్ల పిల్లలను ఆదాయంతో సంబంధం లేకుండా క్రీమీలేయర్ కింద పరిగణించి కోటా నుంచి మినహాయిస్తున్నారు. అయితే, ఈ మినహాయింపులను సవాల్ చేస్తూ కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఇక, ఈ కేసులో సుప్రీంకోర్టు.. కేంద్ర ప్రభుత్వానికి, ఇతర సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

# కేంద్రానికి ఆర్‌బిఐ శుభవార్త

## రూ.2.87 లక్షల కోట్లు డివిడెండ్ ప్రకటన

ముంబయి

కేంద్ర ప్రభుత్వానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుడ్‌న్యూస్ చెప్పింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.2.87 లక్షల కోట్లు డివిడెండ్ రూపంలో చెల్లించనున్నట్లు శుక్రవారం ప్రకటించింది. ఆర్‌బీఐ ఏటా మిగులు నిధులను కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్ రూపంలో చెల్లిస్తుంది. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చిత పరిస్థితుల్లో ప్రభుత్వానికి ఈ మొత్తం ఊరట కల్పించే అంశం. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డు డైరెక్టర్లు నిర్వహించిన 623వ సమావేశంలో డివిడెండ్ చెల్లింపులపై నిర్ణయం తీసుకున్నారు. ఈ స్థాయిలో డివిడెండ్ చెల్లించడం ఇదే తొలిసారి. దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, భయాందోళనల ముప్పును సమీక్షించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్‌బీఐ ఓ ప్రకటనలో పేర్కొంది. దేశ, విదేశీ సెక్యూరిటీలపై వడ్డీ, సేవలపై రుసుములు, కమిషన్లు, విదేశీ మారకపు ద్రవ్యం లావాదేవీలపై లాభం, అనుబంధ సంస్థల నుంచి ప్రతిఫలం రూపేణ ఆర్‌బీఐకు ఆదాయం లభిస్తుంది. కరెన్సీ నోట్ల ముద్రణ, డిపాజిట్లు-రుణాలపై వడ్డీల చెల్లింపులు, సిబ్బంది జీతభత్యాలు-పింఛన్లు, కార్యాలయాల నిర్వహణ ఖర్చులు, ఆకస్మిక పరిస్థితులు-తరుగుదలకు కేటాయింపులు వంటి వ్యయాలు ఉంటాయి. ఈ ఆదాయ, వ్యయాల మధ్య తేడానే మిగులు నిధులుగా వ్యవహరిస్తారు. ఈ మిగులు నిధులను కేంద్రానికి ఏటా బదిలీ చేస్తుంది. ఆర్‌బీఐ, ప్రభుత్వ రంగ బ్యాంకుల డివిడెండ్ల రూపంలో ఖజానాకు రూ.3.16 లక్షల కోట్లు సమకూరుతాయని బడ్జెట్‌లో ప్రభుత్వం అంచనా వేసింది.

# నీట్ పేపర్ లీకేజీలో దర్యాప్తు ముమ్మరం

## లాతూర్‌కు చెందిన డాక్టర్ అరెస్ట్

ముంబయి, అక్షరకలం ప్రతినిధి

లీకైన నీట్ గెస్ పేపర్‌ను కొనుగోలు చేసిన ఒక డాక్టర్‌ను సీబీఐ అదుపులోకి తీసుకున్నది. ఆయన ఆసుపత్రిలో ప్రత్యేక క్లాసులు నిర్వహించి నీట్ గెస్ పేపర్ లీక్ చేయడంపై ప్రశ్నిస్తున్నది. మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన పీడియాట్రిషియన్ డాక్టర్ మనోజ్ శిరూరేకు ఇప్పటికే అరెస్టయిన ఎన్టీఏ కమిటీలో సభ్యుడైన పూణెళికు చెందిన ప్రొఫెసర్ పీవీ కులకర్ణి, ఆర్‌సీసీ క్లాసెస్ డైరెక్టర్ శివరాజ్ మోటెగావ్‌కర్‌తో పరిచయం ఉన్నది. ఈ నేపథ్యంలో తన మేనల్లుడు, మేనకోడలు కోసం నీట్ గెస్ పేపర్‌ను ఆయన కొనుగోలు చేసినట్లు సీబీఐ దర్యాప్తులో తేలింది. దీంతో గురువారం లాతూర్‌లో డాక్టర్ మనోజ్‌ను సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పూణెళిలోని తమ కార్యాలయానికి తరలించి ప్రశ్నిస్తున్నారు. ఆ తర్వాత ఢిల్లీకి తీసుకెళ్లి ఆయన అరెస్ట్‌ను ప్రకటించనున్నారు. కాగా, నీట్ పరీక్షకు కొన్ని రోజుల ముందు డాక్టర్ మనోజ్‌కు చెందిన లాతూర్‌లోని ఆసుపత్రిలో పీవీ కులకర్ణి ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు సీబీఐ తెలిపింది. ఆర్‌సీసీ క్లాసెస్ డైరెక్టర్ శివరాజ్ కుమారుడు కూడా ఈ క్లాస్‌లకు హాజరైనట్లు పేర్కొంది. ఈ ఆసుపత్రిలోనే నీట్ గెస్ పేర్ లీకైనట్లు సీబీఐ నిర్ధారించింది. ఈ నేపథ్యంలో శివరాజ్ కుమారుడు, డాక్టర్ మనోజ్ మేనకోడలు, మేనల్లుడిని కూడా సీబీఐ అధికారులు విడివిడిగా ప్రశ్నించారు. మరోవైపు నీట్ పరీక్షకు ముందు కుమార్తె కోసం లీకైన ప్రశ్నాపత్రాన్ని రూ. 5 లక్షలకు కొనుగోలు చేసినట్లు భావురావు కదమ్‌పై ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో నాందేడ్‌లోని ఆ నివాసంపై సీబీఐ రైడ్ చేసింది. సుమారు ఎనిమిది గంటల పాటు జరిగిన సోదాల్లో కీలక పత్రాలను సీబీఐ అధికారులు పరిశీలించారు. భావురావు కుటుంబ సభ్యులను కూడా ప్రశ్నించారు. తదుపరి విచారణ కోసం పుణెలోని తమ కార్యాలయానికి రావాలని భావురావు, ఆయన కుటుంబ సభ్యులను సీబీఐ ఆదేశించింది. అయితే మే 3న నీట్ ఎగ్జామ్‌ను నిర్వహించగా పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో మే 12న ఆ పరీక్షను ఎన్డీఏ రద్దు చేసింది. ఈ నేపథ్యంలో నీట్ పేపర్ లీక్‌లో పూణె, లాతూర్, నాందేడ్ వ్యక్తుల మధ్య సంబంధాలను సీబీఐ పరిశీలిస్తున్నది. నీట్ లీక్ పేపర్‌ను ఎంత మంది తల్లిదండ్రులు , ఎంతెంతకు కొనుగోలు చేశారు అన్నది దర్యాప్తు చేస్తున్నది.

# తెలంగాణ విద్యా రంగంలో సంచలనం

## విద్యా కమిషన్ చైర్మన్ పదవికి ఆకునూరి మురళి రాజీనామా

## విద్యారంగంలో అనేక మార్పులు సూచిస్తూ నివేదిక

## అంతలోనే రాజీనామా చేయడంపై సర్వత్రా చర్చ

హైదరాబాద్,

తెలంగాణ విద్యా రంగంలో సంచలనం చోటుచేసుకుంది. రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తన పదవికి రాజీనామా చేశారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను ఈ కీలక బాధ్యతల్లో నియమించింది. అయితే, తన పదవికి నాలుగు నెలల ముందుగానే రాజీనామా లేఖను ప్రభుత్వానికి సమర్పించడం రాష్ట్ర రాజకీయ, విద్యా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ విద్యా రంగంపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన అనంతరం ఆకునూరి మురళి ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. విద్యా సంస్కరణల నివేదిక పూర్తి కావడంతో తన బాధ్యత ముగిసిందని పేర్కొంటూ, తన రాజీనామా లేఖను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమర్పించారు. విద్యా సంస్కరణల కోసం ఏర్పాటు చేసిన తొలి విద్యా కమిషన్ చైర్మనే ఇలా అర్ధాంతరంగా తప్పుకోవడంతో, రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ విద్యా విధానాలు, నూతన విద్యా చట్టాల రూపకల్పన ఏ మలుపు తిరుగుతుందనేది ఆసక్తికరంగా మారింది.ఇంకా నాలుగు నెలల పదవీ కాలం మిగిలి ఉండగానే ఆయన ఈ పదవి నుంచి తప్పుకోవడం గమనార్హం. ఈ సందర్భంగా తనకు అవకాశం కల్పించిన తెలంగాణ ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలుపుతూ.. తన రాజీనామా విషయమై సీఎం కార్యదర్శికి కూడా ముందస్తు సమాచారం పంపారు. ఆకునూరి మురళి నేతృత్వంలోని విద్యా కమిషన్ ఇటీవల ప్రభుత్వానికి సమర్పించిన కొన్ని సిఫార్సులు తీవ్ర వివాదానికి దారితీశాయి. ముఖ్యంగా రాష్ట్రంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది వేతనాలు మార్కెట్ ప్రమాణాల కంటే చాలా ఎక్కువగా ఉన్నాయని, వాటిని సమీక్షించి 'హేతుబద్ధీకరించాలని' కమిషన్ చేసిన వ్యాఖ్యలపై ఉపాధ్యాయ సంఘాలు భగ్గుమన్నాయి. దీనికి తోడు ఇంటర్మీడియట్ బోర్డును రద్దు చేసి, ఇంటర్ విద్యను కూడా పాఠశాల విద్యలోనే విలీనం చేయాలనే ఆలోచనలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ సిఫార్సులపై ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలతో పాటు ఉపాధ్యాయ సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టాయి.

# కుల వివక్షత పై చర్యలు తీసుకోవాలి

వడ్ల కొనుగోళ్లు వేగవంతం చేయాలి గజ్వేల్ ఆర్డీవో కు వినతి పత్రం



**అక్షర కలం సిద్దిపేట మే 22:**

బహుజన్ సమాజ్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ కమిటీ గజ్వేల్ అధ్యక్షుడు కొమ్ము చంద్ర ఆధ్వర్యంలో గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ కి వినతిపత్రం అందించడం జరిగింది. గత కొంతకాలంగా గజ్వేల్ నియోజకవర్గం లోని కొన్ని గ్రామాల్లో కుల వివక్షత చూపిస్తూ మరి ముఖ్యంగా జగదేవ్పూర్ మండలంలోని గ్రామాల్లో కుల బహిష్కరణ చేస్తూ మరియు వారి పైన దాడులు చేస్తున్న వారి పైన చర్యలు తీసుకోవాలని ఇలాంటివి జరగకుండా "సివిల్ రైట్స్ డే" పకడ్బందీగా నిర్వహించాలని ఈ సందర్భంగా వారిని కోరడం జరిగింది.అలాగే వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నెలల తరబడి ఐకెపి సెంటర్ లు వద్దనే రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వడ్ల లారీలు లేకపోవడం తో ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని కూడా ఆర్టీవో కి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. తక్షణమే ఇట్టి సమస్యలను పరిష్కరించాలని వారిని కోరడం జరిగింది. వారు సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ఆర్టీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొండనోళ్ల నరేష్ అసెంబ్లీ ఇంచార్జ్ మొండి కరుణాకర్ , అసెంబ్లీ అధ్యక్షుడు కొమ్ము చంద్రం అసెంబ్లీ ఉపాధ్యక్షులు బయ్యారం శ్రీకాంత్,ప్రధాన కార్యదర్శి కనక ప్రసాద్,శరదని రాము, కర్రోళ్ల నవీన్ పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# గోద్రెజ్ ఆగ్రోవేట్ సంస్థ సౌజన్యంతో ప్రత్యేక ఆయిల్ ఫామ్ స్టాల్ ఏర్పాటు.. సందర్శించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ



**సంగారెడ్డి ప్రతినిధి, అక్షరకలం..**


జిల్లా స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈరోజు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించే ఉద్దేశంతో గోద్రెజ్ అగ్రోవేట్ సంస్థ సౌజన్యంతో ప్రత్యేక ఆయిల్ పామ్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆరోగ్యశాఖ మంత్రివర్యులు శ్రీ దామోదర రాజనర్సింహ గారుహాజరై స్టాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయిల్ పామ్ సాగుకు సంబంధించిన వివరాలను జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వరరావు మంత్రికి వివరించారు. రైతులకు స్థిరమైన మరియు అధిక ఆదాయాన్ని అందించే పంటగా ఆయిల్ పామ్‌ను ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నదని వారు తెలిపారు. రైతాంగాన్ని ఆర్థికంగా మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని పేర్కొన్నారు. అదేవిధంగా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరకే పంట కొనుగోలు చేయడం జరుగుతుందని, పంటకు సంబంధించిన చెల్లింపులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని అధికారులను మరియు రైతాంగాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వరరావు, గోద్రెజ్ అగ్రోవేట్ సంస్థ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారుల పాల్గొన్నారు.

# గీతంలో వినూత్న మార్గదర్శన కార్యక్రమం

## విద్యార్థుల సాధికారతే లక్ష్యంగా ప్రారంభించిన టీఎంసీజీ డైరెక్టర్ డాక్టర్ రోజీనా మాథ్యూ

**సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..**

అర్థవంతమైన మార్గదర్శనం, సలహాల ద్వారా విద్యార్థులకు సాధికారత కల్పించే లక్ష్యంతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఒక వినూత్న విద్యార్థి మార్గదర్శన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గీతం వృత్తిపరమైన సలహాల కేంద్రంలోని శిక్షణ, మార్గదర్శకత్వం, వృత్తిపరమైన సలహాలు (టీఎంసీజీ) డైరెక్టర్ డాక్టర్ రోజీనా మాథ్యూ దీనికోసం ఓ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విద్యార్థులు తమ విద్య, వృత్తి, వ్యక్తిగత అభివృద్ధికి సంబంధించిన ఆందోళనలను పరిష్కరించుకోవడంలో సహాయ పడటానికి 'టాక్ టైమ్' పేరుతో ఒక ప్రత్యేకమైన ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా, డాక్టర్ మాథ్యూ 2026 మే 11 నుంచి డిసెంబరు 31 మధ్య కాలంలో, ప్రతిరోజూ సాయంత్రం 4.00 నుంచి 5.30 గంటల వరకు సమయాన్ని కేటాయిస్తున్నారు. ఈ సమయంలో విద్యార్థులకు 15 నిమిషాల చొప్పున వ్యక్తిగత సంభాషణకు (నేరుగా మాట్లాడటం) ఆమె అవకాశం కల్పిస్తున్నారు. శని, ఆదివారాలు మినహా, మిగిలిన అన్ని పనిదినాలలో ఈ సెషన్లు అందుబాటులో ఉంటున్నాయి.నైపుణ్యాభివృద్ధి-పరిశ్రమ సంసిద్ధత, వృత్తి మార్గదర్శనం-మార్గాలు, మార్గదర్శకత్వం-వృత్తిపరమైన అభివృద్ధి, అభిప్రాయాలు-ఆందోళనలకు సంబంధించిన విషయాలను చర్చించడానికి విద్యార్థులకు సౌకర్యవంతమైన, బహిరంగ వేదికను అందించేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమం విద్యార్థులను తమ ఆలోచనలను స్వేచ్ఛగా వ్యక్తపరచడానికి, సందేహాలను నివృత్తి చేసుకోవడానికి మార్గనిర్దేశం కోరడానికి, సహాయక వాతావరణంలో నిర్మాణాత్మక సలహాలను పొందడాన్ని ప్రోత్సహిస్తోంది.ఈ కార్యక్రమం యొక్క ఉద్దేశాన్ని డాక్టర్ రోజీనా మాథ్యూ వివరిస్తూ, విద్యార్థులు తమ ఆలోచనలను బహిరంగంగా పంచుకోవడానికి, ముఖ్యమైన నిర్ణయాలపై స్పష్టత పొందడానికి, వ్యక్తపరచడానికి సంకోచించిన ఆలోచనలను చర్చించడానికి, వారి విద్యా, వృత్తిపరమైన ఎదుగుదలను ప్రభావితం చేసే సవాళ్లపై కొత్త దృక్కోణాలను పొందడానికి వీలుగా నిజమైన, అర్థవంతమైన సంభాషణలను సృష్టించడం ఈ టాక్ టైమ్ కార్యక్రమ ఉద్దేశ్యమని చెప్పారు. స్లాట్ల సంఖ్య పరిమితంగా ఉన్నందున, విద్యార్థులు తమ వంతుగా సమయాన్ని పొందేటప్పుడు స్పష్టమైన చర్చాంశాలతో సిద్ధంగా రావాలని, అవకాశాన్ని బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవాలని, సార్థకమైన సంభాషణను చేయాలని ఆమె స్పష్టీకరించారు.విద్యార్థులతో తాను పంచుకున్న క్యూఆర్ కోడ్ లేదా వెబ్ లింక్ ద్వారా అపాయింట్ మెంట్లను రిజర్వు చేసుకోవాలని డాక్టర్ రోజీనా సూచించారు.




# సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ చిత్రపటాలకు పాలాభిషేకం

**అక్షర కలం సిద్దిపేట మే 22:**

రాష్ట్రంలోని 1 కోటి 11 లక్షల మంది కార్మికులకు కనీస వేతనం 20 వేలు గా తీసుకున్న నిర్ణయాన్ని హర్షం వ్యక్తం చేస్తూ ?ఈ చారిత్రాత్మక నిర్ణయానికి కృతజ్ఞతగా శుక్రవారం సిద్దిపేట జిల్లా ముస్తాబాద్ చౌరస్తా లో పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యం లో ,కాంగ్రెస్ నాయకులు సీఎం, కార్మిక శాఖ మంత్రి, ఇంచార్జ్ పూజల హరికృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అత్తు ఇమామ్,ఆత్మ కమిటీ చైర్మన్ పూజల గోపిక్రిష్ణ ముఖ్య అతిథి పాల్గొని వారు విలేఖరులతో మాట్లాడుతూ కార్మికులకు ఈ నిర్ణయం వల్ల మేలు చేకూరుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని ఈ నిర్ణయం ద్వారా మరోసారి నిరూపించడం



జరిగిందని అన్నారు.కార్మికులకు కనీస వేతనం 20 వేలు నిర్ణయించినందుకు సీఎం రేవంత్ రెడ్డి, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రకటించినందుకు కార్మికుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీశైలం యాదవ్,

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కలిముద్దీన్ అహ్మద్, దాస అంజన్న, మార్క సతీష్, డిసిసి మహిళా అధ్యక్షులు ముద్దశీ లక్ష్మి, మహిళా టౌన్ అధ్యక్షులు మార్క పద్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు,ఎర్ర మహేందర్,అర్షద్,వాహబ్,గాయశు ద్దీన్,రషద్,ఆతిక్ టీఎంపీస్ జిల్లా అధ్యక్షులు చెంది శ్రీనివాస్ ముదిరాజ్, ఏఎంసి వైస్ చైర్మన్ బుస్స రాజశేఖర్,ఆత్మ డైరెక్టర్లు అజమాత్,అశోక్,జనార్దన్ రెడ్డి,బూర్గుపల్లి సర్పంచ్ బాలయ్య,ప్రవీణ్,మల్లేశం,స్రవంతి,రజని,సన పాల్గొన్నారు.

# కొండాపూర్--గొల్లపల్లి సొసైటీల్లో కేంద్రాలను ప్రారంభించిన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి

**సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..**

రైతులు పండించిన జొన్న పంటను చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం కొండాపూర్, గొల్లపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలో జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. గొల్లపల్లి సొసైటీ



చైర్మన్ ఎల్. శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నిర్మల జగ్గారెడ్డి పాల్గొని రైతులతో మాట్లాడారు. రబీ సీజన్‌లో కొండాపూర్ ప్రాంత రైతులు అధికంగా జొన్న సాగు చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వం క్వింటాల్ జొన్నలకు రూ.3,699 మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ పంటను విక్రయించాలని సూచించారు. దళారులకు అమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి రైతుకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గొల్లపల్లిలో రైతులతో మాట్లాడిన నిర్మల జగ్గారెడ్డి, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్. కొండాపూర్ సొసైటీ సిరాజ్. సొసైటీ చైర్మెన్లు శ్రీకాంత్ రెడ్డి. మాణిక్యరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ వై.ప్రభు, , మండల పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభుదాస్ జనరల్ సెక్రెటరీ నర్సింహులు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆయిల్ రెడ్డి గారీ నరసింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్. కిషన్ నాయక్, ప్రభాకర్, అశోక్, జాకీర్, బాల్‌రాజ్ గౌడ్, సత్యనారాయణ, వ్యవసాయ శాఖ అధికారులు, మార్కెటింగ్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్పందన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన గద్వాల్ పట్టణంలోని 7వ వార్డు కౌన్సిలర్ టి ఎన్ ఆర్ జగదీష్

**జోగులాంబ గద్వాల జిల్లా అక్షర కలం ప్రతినిధి**



జోగులాంబ గద్వాల నియోజకవర్గం పిల్లిగుండ్ల కాలనీలో స్పందన ఫౌండేషన్ అధ్యక్షుడు కృష్ణ ఆధ్వర్యంలో బాధితురాలు బేడ బుడగ జంగం సుదర్శనమ్మకు 7వ వార్డ్ కౌన్సిలర్ టిఎన్ఆర్ జగదీష్ నిరుపేద కుటుంబానికి 10,000 రూపాయలు 50 కేజీల బియ్యం ఇవ్వడం జరిగింది. ఆ కుటుంబానికి ఇల్లు లేక సరైన వసతులు లేక ఇబ్బందిగా ఉన్నందువలన స్పందన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆ నిరుపేద కుటుంబానికి మన గద్వాల జిల్లా నియోజకవర్గ యువకులు ప్రజలు ప్రభుత్వం నుంచి కానీ లేదా దాతల నుండి కానీ కుటుంబనికి వారి పిల్లలకు చిన్న గూడు కట్టుకోవడానికి తలా వంతు సాయం చేయాలని వీరికే కాక ఇతరులకు ఎవరికి ఏ ఆపద ఉన్న మా ఫౌండేషన్ ద్వారా విద్య సహాయం, వైద్య సేవలు, గోవుల సంరక్షణ, అనాథలకు సేవ చేయడం, పర్యావరణ పరిరక్షణ మొదలకు సేవలు దాతల సహాయంతో ఆదుకుంటామని స్పందన ఫౌండేషన్ అధ్యక్షుడు కృష్ణ కోరారు. రాయుడు, హోటల్ బాబు, దడవాయి నరసింహ, పరశురాముడు, బీచుపల్లి, రాజు స్పందన ఫౌండేషన్ కమిటీ నెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది ;- మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ;

**(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, మే 22)**

పేద ప్రజల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశు సంవర్ధక,యువజన సేవలు, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి. నారాయణపేట జిల్లాలో 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా పట్టణంలోని గాయత్రి ఫంక్షన్ హాల్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథి గా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.... వలసల జిల్లాగా ఉన్న నారాయణపేట ను సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశం తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాదాపు 5 వేల కోట్ల రూపాయలతో మక్తల్ -నారాయణపేట -కొడంగల్ ఎత్తి పోతల పనులకు శ్రీకారం చుట్టారని తెలిపారు.గతంలోఈ ప్రాజెక్ట్ కోసం దశబ్దాలుగా పోరాటం చేసినా ఫలితం శూన్యం అని అన్నారు. ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ అధికారం లోకి రాగానే పాలమూరు బిడ్డ ముఖ్య మంత్రి గా ఉన్నందుకు ఈ ప్రాజెక్ట్ ముందుకు సాగి ఇప్పుడు కాట్రేపల్లి నుంచి కాన్ కార్తి వరకు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. గతంలో పాలమూరు ప్రజల జీవనం ఆగమ్యగోచరంగా ఉండేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు మక్తల్- నారాయణపేట -కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్ట్



పూర్తయితే ఇక్కడి ప్రాంతం మరో కోనసీమ అవ్వడం ఖాయమన్నారు. పచ్చని పంట పొలాలతో ఈ ప్రాంతం సస్యశామల్యం అవుతుందన్నారు.

ఇకపై నారాయణపేట జిల్లా వలసల జిల్లా కాదని వలసలను తెచ్చుకొనే జిల్లా గా మారిపోనుందని మంత్రి తెలియజేశారు.రాష్ట్ర అభివృద్ధిలో అధికారులు, ప్రజలు.. అందరి సహకారం ఉండమొదట్లో ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామంటే ఎవ్వరూ నమ్మలేదని ఇప్పుడు గ్రామ గ్రామానా ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేసుకొని గృహ ప్రవేశాల పండుగలు చేసుకుంటున్నారని మంత్రి వెల్లడించారు. అర్హులైన పేదలు ఇంకా ఎవరైనా ఇల్లు లేకుండా ఉంటే వారికి ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని మంత్రి స్పష్టం చేశారు. గ్రామాల్లో సర్పంచ్ లు, వార్డ్ మెంబెర్ లు , కౌన్సిలర్లు, చైర్ పర్సన్ లు బాధ్యత గా పని చేసి గ్రామాలను బాగు చేసుకోవాలని పిలుపునిచ్చారు. రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతీ పేద వాడికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు.గతంలో వరి వేస్తే ఉరి అన్నారని కానీ ప్రజా ప్రభుత్వం వచ్చాక వరి వేస్తే సిరిని చేశామన్నారు. రైతులు పండించిన వడ్లకు బోనస్ తో పాటు గిట్టు బాటు ధర ఇచ్చి మరీ కొనుగోలు చేస్తుందని గుర్తు చేశారు. ప్రతీ పేదవాడికి నెలకు 6 కిలోల చొప్పున సన్న బియ్యం రేషన్ షాప్ ల ద్వారా ఇస్తున్నామని తెలిపారు. ప్రతీ గ్రామానికి రేషన్ షాప్ ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. గ్రామాల్లో తాగు నీటికి ఇబ్బంది ఉండకుండా చూడాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు రావాలంటే అధికారుల పాత్ర చాలా అవసరమన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలలో పెండింగ్ ఫైల్స్, పనులు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం అధికారులను విశ్వసించి, నమ్మి 99 రోజుల కార్యాచరణ ఇచ్చిందని, అధికారులు తమ బాధ్యత ను విస్మరించ వద్దని సూచించారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చే మున్సిపల్ చైర్ పర్సన్ లు, కౌన్సిలర్లు, సర్పంచులకు అధికారులు గౌరవం ఇచ్చి వాళ్ళు తెలిపిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. తన రాజకీయ జీవితం సర్పంచ్ నుంచే ప్రారంభమైందని చెప్పారు. ఈ సారి పంచాయతీ ఎన్నికలలో కొత్తగా ఎన్నికైన సర్పంచులలో అధికంగా యువకులే ఉన్నారని, వారి హయాంలో తమ తమ గ్రామాలకు ఏదైనా చేయాలనే తపన వారిలో ఉందన్నారు. బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం రావాలని మంత్రి ఆకాంక్షించారు. మహిళా సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి వారి ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం తోడ్పాటు అందించిందని మంత్రి తెలిపారు. మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ల నిర్వహణ, ఆర్టీసి అద్దె బస్సుల నిర్వహణ చేస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక మాట్లాడుతూ... రెండేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, ఫలితాలపై క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహించడంతోపాటు అర్హులైన వారందరికీ పథకాలు అందించేలా గ్రామ, వార్డు సభలు జరిగాయని అన్నారు.విద్యావ్యవస్థలో తీసుకొస్తున్న సంస్కరణలు, వైద్యరంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలు, అసుపత్రులను తీర్చిదిద్దే ప్రణాళికను ప్రజలకు వివరించడం జరిగిందన్నారు.స్థలాలు ఉండీ ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని నూరుశాతం అమలు చేయడం జరుగుతుందన్నారు.

# ఘనంగా ప్రజా పాలన - - ప్రగతి ప్రణాళిక 99 డేస్ యాక్షన్ ప్లాన్

**అక్షర కలం సిద్దిపేట, మే 22**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" 99 డేస్ యాక్షన్ ప్లాన్ కార్యక్రమం శుక్రవారం సిద్దిపేట జిల్లాలో ఘనంగా నిర్వహించబడింది. జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లాలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మరియు రాబోయే పథకాలపై సమగ్ర వివరాలు వెల్లడించబడినాయి. విద్యార్థుల ఆరోగ్యం కోసం రాగి జావ లేదా పాలు అందించే అల్పాహార పథకం, ఇంటర్మీడియట్ వరకు మధ్యాహ్న భోజన పథకం, వికలాంగ విద్యార్థులకు ప్రత్యేక వాహనాల సౌకర్యం, కుటుంబ జీవిత బీమా వంటి పథకాలు త్వరలో అమలులోకి రానున్నట్లు తెలిపారు.రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొంటూ రైతు భరోసా, రైతు బీమా, రైతు రుణమాఫీ కార్యక్రమాల ద్వారా లక్షలాది మంది రైతులకు లబ్ధి చేకూరిందని వెల్లడించారు. 2023 యాసంగి నుండి 2025 యాసంగి వరకు జిల్లాలో 3,19,977 మంది రైతులకు రూ.1119 కోట్ల రైతు భరోసా నిధులు జమ చేసినట్లు తెలిపారు. అలాగే రైతు బీమా కింద 2,703 క్లెయిమ్లు పరిష్కరించి రూ.135 కోట్ల సాయం అందించబడిందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద జిల్లాలో 10,898 ఇండ్లు మంజూరు కాగా, వాటిలో 1,710 ఇండ్లు పూర్తిగా నిర్మాణం పూర్తి చేసుకున్నాయని, లబ్ధిదారుల ఖాతాల్లో ఇప్పటివరకు రూ.25.33 కోట్లు జమ చేసినట్లు వివరించారు.మహాలక్ష్మి పథకం ద్వారా రూ.500లకు గ్యాస్ సిలిండర్ల సరఫరా, కొత్త రేషన్ కార్డుల మంజూరు, మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు, వడ్డీ లేని రుణాలు వంటి కార్యక్రమాలు మహిళా సాధికారతకు దోహదపడుతున్నాయని తెలిపారు.

"చేయూత" పింఛన్ పథకం కింద జిల్లాలో 1,82,136 మంది లబ్ధిదారులకు ప్రతి నెల రూ.39.40 కోట్ల పింఛన్లు అందిస్తున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా వికలాంగుల కోసం యూడీఐడీ శిబిరాలు నిర్వహిస్తూ ధ్రువపత్రాలు జారీ చేస్తున్నట్లు తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యా వారోత్సవాలు, సమ్మర్ క్యాంపులు, స్టూడెంట్ టాలెంట్ ఫెస్ట్ కార్యక్రమాలు విద్యార్థుల ప్రతిభాభివృద్ధికి తోడ్పడుతున్నాయని పేర్కొన్నారు. యువత మరియు క్రీడల వారోత్సవాలు, మహిళా సంక్షేమ కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు కూడా దశలవారీగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు వారోత్సవాల్లో మట్టి పరీక్షలు, డ్రోన్ టెక్నాలజీ, వ్యవసాయ యాంత్రీకరణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడినట్లు తెలిపారు. 1905 మట్టి నమూనాలు సేకరించి 330 భూమి ఆరోగ్య కార్డులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. నీటిపారుదల శాఖ వివరాల ప్రకారం జిల్లాలోని రిజర్వాయర్ల ద్వారా 79,209 ఎకరాలకు సాగునీరు అందించబడగా, చెరువులు మరియు చెక్‌డ్యాంల ద్వారా అదనంగా 27,702 ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పించబడింది. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా జిల్లాలో 6,715 మంది లబ్ధిదారులకు రూ.165.35 కోట్ల వ్యయంతో ఉచిత వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. పశుసంవర్ధక, మత్స్య, ఎస్సీ కార్పొరేషన్ శాఖల ద్వారా అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాల పురోగతిని కూడా సమావేశంలో వివరించారు. ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ప్రతి వర్గానికి సంక్షేమ ఫలాలు చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు.



అక్షర కలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# రేవంత్ ఆలోచనకు తగ్గట్లుగా ఫ్యూచర్ సిటీ కదిలేనా ?

**రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండున్నరేళ్లు దాటింది. ఇక రేవంత్ రెడ్డికి ఉన్నది కేవలం రెండేళ్ల కాలం మాత్రమే. ఈ రెండేళ్లలో ఆయన అనుకున్న పనులు నెరవేరుస్తారా అన్నది అనుమానమే. ఎందుకంటే ఈ రెండున్నరేళ్లలో గట్టిగా ఒక నిర్మాణాత్మక పనికూడా చేపట్టలేదు. ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తి చేయాలేదు. ఎందుకంటే కేవలం సంక్షేమాలతో నెట్టుకు వస్తున్నారు. రేషన్ కార్డులు పెంచడం, సన్నబియ్యం ఇవ్వడం, రైతు భరోసా వేయడం వంటివన్నీ అభివృద్ధి కిందకు రావు. ఈ క్రమంలో ఆయన పెద్ద పనిని తలన పెట్టుకున్నారు. అదే ఫ్యూచర్ సిటీ. ఇప్పుడున్న హైదరాబాద్ ఇంతగా పెరగడానికి కొన్ని దశాబ్దాలు పట్టింది. మెల్లాగా ఇది అల్లుకుంటూ పోవడం వల్ల పెరిగందే తప్ప రాత్రికి రాత్రి పెరగలేదు. చంద్రబాబు సైబరాబాద్‌కు బీజం వేసినా, ఇవాళ ఓఆర్ఆర్ వరకు నగరం విస్తరించడానికి దాదాపు రెండున్నర దశాబ్దాల కాలం పట్టింది. అందువల్ల ఒక సిటీని కట్టాలంటే అనుకున్నంత ఈజీగా అమాంతంగా కట్టలేం. అమరావతి కోసం నిధులు ఉండీ చంద్రబాబు నానా తంటాలు పడుతున్నారు. మధ్యలో జగన్ మావిగన్ అంటూ కొత్త పల్లవి అందుకున్నారు. అమరావతి ఇప్పట్లో పూర్తి అయ్యేలా లేదు.**

పోలవరం కట్టడానికి దాదాపు 15 ఏళ్లు పట్టింది. నిధులు ఉండి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తే ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగవచ్చు. కానీ ఫ్యూచర్ సిటీ కోసం రూపాయి కూడా వెచ్చించడానికి లేదు. నిధుల లేమి రాష్ట్రాన్ని పట్టి పీడిస్తోంది. అక్కడ భూములు సేకరించి ఉన్నాయి కనుక ఫ్యూచర్ సిటీ కట్టేయలేం. కొన్ని కార్యాలయాలు తరలించినా, కొందరికి భూములు కేటాయించినా ఇది సాధ్యం అయ్యే పనికాదు. దీనికి తోడు కేవలం రెండంటే రెండేళ్ల కాలం మాత్రమే ఉంది. ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, నెట్ జీరో తరహాలో రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇందులో ఎలాంటి రాజీ పడొద్దని కూడా చెప్పారు. ఈ మేరకు ప్రపంచస్థాయి నగరాలను అధ్యయనం చేసి ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. ఇప్పటికే అక్కడ ఓ ఈవెంట్ నిర్వహించి, పెట్టుబడిదారులను ఆహ్వానించినా, అక్కడ ఎలాంటి మౌలిక వసతులు లేకుండా ఎలా అడుగు వేస్తారో అధికారుకలకు కూడా అర్థం కాదు. ఫ్యూచర్ సిటీలో భూ కేటాయింపులు, పరిశ్రమల ఏర్పాటు అంశాలపై ఎన్ని ఆదేశాలు జారీ చేసినా నిర్దిష్ట ప్రణాళిక మేరకు ముందుకు సాగాల్సి ఉంటుంది. ప్రజాప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్టుల కోసం 500 ఎకరాలు కేటాయించాలని నిర్ణయించారు. మౌలిక సదుపాయాల నిర్మాణం తర్వాతే భూ కేటాయింపులు జరపాలన్నారు. అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్ సిటీకి తీసుకువచ్చేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన హెల్త్ క్లస్టర్‌ను కూడా తీసుకొద్దామని, అవసరమైతే ప్రధాని నరేంద్రమోదీని కలిసి హెల్త్ క్లస్టర్ కేటాయించాలని విజ్ఞప్తి చేద్దామన్నారు. జూన్ నెలలో ఫ్యూచర్ సిటీ ఇండస్ట్రియల్ పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపన జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. భూ కేటాయింపు జరిగిన వెంటనే పరిశ్రమల నిర్మాణం ప్రారంభించేలా నిబంధనలు రూపొందించాలన్నారు. పెట్టుబడులను ఆకర్షించటం కోసం 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరిట ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయాలని, దీనికి లోగో, వెబ్‌సైట్ రూపొందిం చాలని



ఆదేశించారు. పెట్టుబడులకు ముందుకొచ్చేవారికి ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థను తీసుకురావాలని, గ్రూప్–1 స్థాయి అధికారులను నియమించాలన్నారు. ఇవన్నీ బాగానే ఉన్నా, అక్కడ మౌలిక వసతులు, ముఖ్యంగా రోడ్లు, నీరు, విద్యుత్ వంటి సౌకర్యాలను పెద్ద ఎత్తున చేపట్టాల్సి ఉంటుంది. బుల్లెట్ ట్రెయిన్ ప్రాజెక్టు కోసం భూ సేకరణ ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసినా, అందుకు కేంద్రం త్వరగా నిధులు విడుదల చేయాల్సి ఉంది. 1500 ఎకరాల్లో డేటా సిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఫ్యూచర్ సిటీ దేనికి ప్రాధాన్యం అన్నది కూడా ముఖ్యమే. ఇప్పటికిప్పుడు అక్కడికి వెళ్లి ఉండలేం. అక్కడ ఎలాంటి మౌలిక వసతులు లేకుండా ఎవ్వరు కూడా ఉండలేరు. ఇది ఓరకంగా చెప్పాలంటే త్రిశంకు స్వర్గాన్ని సృష్టించడమే అవుతుంది. 2029లో జరిగే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రిగా ఉంటానని... పదిన్నరేళ్లు సీఎంగా పనిచేసి రికార్డు సృష్టిస్తానని రేవంత్‌రెడ్డి ఇటీవలే ప్రకటించారు. బహుశా ఇదే ధీమాతో మరో పదేళ్లకు దీని గురించి ప్లాన్ వేసుకున్నారా అన్నది తెలియదు. ఒకవేళ సిఎం రేవంత్ రెడ్డిని ప్రజలు మరోమారు గెలిపించక పోతే ఫ్యూచర్ సిటీ ఫ్యూచర్ ఏంటన్నది ప్రశ్నార్థకం. ఒకవేళ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ఎవరు సిఎం అన్నది అప్పుడే నిర్ణయిస్తారు. ఒక్క వైఎస్ విషయంలో మాత్రమే రెండో ఆలోచన లేకుండా ఆయనను సిఎం చేశారు. అధిష్ఠానం ఎవరిని నిర్ణయిస్తే వారే ముఖ్యమంత్రి అని ప్రకటించడం కాంగ్రెస్ ఆనవాయితీ. దీనికి భిన్నంగా, వచ్చే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రి అని రేవంత్‌రెడ్డి ప్రకటించుకున్నారు. ఆయన చేసిన ఈ ప్రకటన కొంతమంది కాంగ్రెస్ నాయకులకు మింగుడు పడకపోవచ్చు. అయితే తనకు తాను ఇలా ప్రకటించుకున్నా, పరిస్థితులు మన చేతుల్లో లేవు. తమిళనాడు, కేరళ, బెంగాల్ పరిస్థితులు చూశాం. వచ్చే రెండేళ్లలో ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం. మంత్రుల తీరు కూడా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉంటోంది. కొంతమంది మంత్రులు సమాంతర వ్యవస్థలను నడుపుతున్నారన్న విమర్శ ఉంది. కాబట్టి నిర్మాణాత్మక వైఖరి అవసరం. అందుకు అనుగుణంగా కార్యాచరణ కావాలి. ప్రజల్లో ఇమేజ్ సంపాదించాలి. ఇవన్నీ చేసి, మళ్లీ అధికారంలోకి వస్తేనే ఫ్యూచర్ సిటీపై ప్రభావం ఉంటుంది. లేకుంటే ఈ రెండేళ్ల స్వల్ప కాలంలో ఇది మనుగడలోకి రావడం ముమ్మాటికీ సాధ్యం కాకపోవచ్చు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 22:**

రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య తెలిపారు. శుక్రవారం జిల్లాలోని చెన్నూరు మండల కేంద్రంలో గల వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదామును జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు, మండల తహశీల్దార్ మల్లికార్జున్, అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ పి చంద్రయ్య మాట్లాడుతూ, జిల్లాలో వరి



ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియ, ధాన్యం నిల్వలు, రవాణా ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని, గోదాంలో ధాన్యం తరలింపులో జాప్యం జరుగుతుండటంతో పాటు హమాలీల సమస్యపై కార్మికులు, రైతుల నుండి ఫిర్యాదులు, హమాలీల కొరత కారణంగా ధాన్యం అన్‌లోడింగ్, లోడింగ్ పనులు ఆలస్యమవుతున్న నేపథ్యంలో కార్మిక శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అవసరమైన హమాలీలను తక్షణమే ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. గోదాం ఇన్‌చార్జ్, అధికారులు విధుల పట్ల బాధ్యత యుతంగా వ్యవహరించాలని, రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా స్వీకరించి వేగంగా అన్‌లోడింగ్ చేపట్టాలని సూచించారు. ధాన్యం రవాణాలో ఇబ్బందులు తలెత్తకుండా తగిన సంఖ్యలో లారీలను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం వస్తున్న ధాన్యం పరిమాణాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు తీసుకొచ్చే ధాన్యాన్ని నిల్వ చేయడానికి, అన్‌లోడింగ్ ప్రక్రియను సులభతరం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులు వర్షాలు, ఇతర ఇబ్బందుల వల్ల నష్టపోకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం, పాల్గొన్నారు.

## బాలిక విద్యను ప్రోత్సహించిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ

**జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్**

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 22:**

దళిత బాల బాలికల విద్యను ప్రోత్సహించిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా షెడ్యూల్డ్



కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భాగ్యరెడ్డి వర్మ జయంతి కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ యాదయ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి హనుమంతరెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, సంబంధిత శాఖల అధికారులతో కలిసి హాజరై, భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, దళిత బాల బాలికల విద్యను ప్రోత్సహించారని, సంఘసంస్కర్తగా దళిత బాలికల పాఠశాలలను స్థాపించి వారి అభ్యున్నతికి కృషి చేశారని తెలిపారు. సాహిత్యం, హరికథలు, ఉపన్యాసాల ద్వారా ప్రజలలో చైతన్యం తీసుకువచ్చారని, బాల్య వివాహాలు, దేవదాసి, జోగిని వంటి దురాచారాలను నిర్మూలించడం కోసం కృషి చేశారని తెలిపారు. మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని, మహానుభావులు చూపిన ఆదర్శనీయ మార్గదర్శకాలు ప్రతి ఒక్కరూ ఆచరిస్తూ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలి

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 22:**

జిల్లాలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేసి గోదాములకు తరలించిన ధాన్యం దిగుమతి ప్రక్రియ



వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు తెలిపారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ మండలం తీగల్ పహాడ్ లోని గోదామును ఏసీఎస్ఓ వేణుగోపాల్, నస్పూర్ మండల తహశీల్దార్ సంతోష్ లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు మాట్లాడుతూ, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి నిబంధనల మేరకు కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతుల కోసం కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. రైతుల వద్ద నుండి కొనుగోలు చేసి గోదాములకు తరలించబడిన ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేయాలని, అవసరం మేరకు హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని గోదాం నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్కిల్డ్ ల వారీగా కాంట్రాక్టు కార్మికులకు జీతాలు పెంచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనీయుడు.---- ఎస్కె మహబూబ్ డిప్యూటీ



## సెంట్రల్ జనరల్ సెక్రెటరీ.

**అక్షర కలం / ఇల్లెందు.**

రాష్ట్రంలోని కాంట్రాక్టు కార్మికులకు స్కిల్డ్ ల వారీగా ఒక్కొక్కరికి ప్రస్తుతం వస్తున్న జీతాలకు అదనంగా మూడు వేల పైగా జీతాలను పెంచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి రాష్ట్ర కనీస వేతన చైర్మన్ జనక్ ప్రసాద్ ల కు కాంట్రాక్టు కార్మికుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్టు ఐఎన్టియుసి డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్కెఐ మహబూబ్ అన్నారు. 100 సంవత్సరాల చరిత్రలో కాంట్రాక్టు కార్మికులకు ఇలాంటి చారిత్రిక వేతన ఒప్పందం అమలు చేయ ప్రయత్నం చేయలేదని ఆయన అన్నారు. రాష్ట్రంలో స్కిల్డ్,అన్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్, హైలీ స్కిల్డ్ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ప్రస్తుతం వారి కోస్తున్న జీతాలకు అదనంగా మూడు వేల నుండి ఐదువేల పైబడి జీతాలను పెంచారని కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచేందుకు ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క రాష్ట్ర మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కార్మిక శాఖ మంత్రి వివేక్ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వారితోపాటు రాష్ట్ర కనీస వేతనాల చైర్మన్ జనక్ ప్రసాద్ సమావేశమై ఈ ఒప్పందాన్ని ప్రకటించినట్టు ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇది ప్రజల ప్రభుత్వమని ప్రజల పక్షపాతి ప్రభుత్వమని ఆయన అన్నారు.

## జూన్ 15 నుండి అక్టోబర్ 1 వరకు “సర్” .ప్రక్రియనిర్వహించబడును.. సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట,

**అక్షర కలం / భద్రాచలం**

భారత ఎన్నికల కమిషన్ చే జారీ



చేయబడినమూడవదశ”సర్”షెడ్యూల్ లో భాగంగా మన తెలంగాణ రాష్ట్రంలో జూన్ పదిహేనో వ తేదీ నుండి అక్టోబర్ ఒక్క టో తేదీ వరకు “సర్” ప్రక్రియ నిర్వహించబడునని నూట పొందొమ్మిది (ఎస్ టి) భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మరియు భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట,శుక్రవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.కావునఎన్నికల కమిషన్ మరియు తెలంగాణసీఈవో ఆదేశాల మేరకు భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం మీటింగ్ హాల్ నందు పని దినాలలో ఉదయం పది గంటల ముప్పై నిమిషాల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు భద్రాచలం ఓటర్ల ప్రయోజనార్థం “సర్” మ్యాపింగ్ హెల్ప్ డెస్క్ నిర్వహించబడుతున్నదని ఆయన అన్నారు.కావున ఓటర్లందరు తమ ఓటు కార్డు, ఆధార్ కార్డులతో హెల్ప్ డెస్క్ ను సంప్రదించి ఓటర్ మ్యాపింగ్ చేసుకోగలరని ఆయన కోరారు. ఇతర వివరములకు హెల్ప్ డెస్క్ ఫోన్ నెంబర్ 08743–232444 సంప్రదించగలరని ఆయనతెలిపారు.

## ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే జిల్లా అభివృద్ధి... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ప్రజల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ పథకాలు విజయవంతంగా అమలు**

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లా ముందంజ**

**99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**


**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయం తోనే జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.శుక్రవారం స్థానిక భక్త రామదాసు కళా క్షేత్రంలో నిర్వహించిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాలుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, లక్ష్యాలను ప్రజలకు వివరించేందుకు 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే మంచి ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభ సమయంలో లబ్ధిదారులు ఇంటి నిర్మాణంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం, ఇందిరా మహిళా శక్తి క్రింద బ్యాంకు రుణాలు కల్పన వంటి చర్యలతో పనులు వేగవంతమయ్యాయని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోనే అత్యధికంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ఖమ్మం జిల్లాలో పూర్తయ్యాయని వెల్లడించారు.ఇటీవల నిర్వహించిన జాబ్ మేళాలో యువతకు పెద్ద సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా పనిచేస్తే జిల్లా మరింత అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. ఇటీవల ఎన్నికైన సర్పంచులు, మున్సిపల్ వార్డు సభ్యులు ప్రజలకు మరింత చేరువై సేవలు అందించాలని సూచించారు.ఖమ్మం జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రతి ప్రజాప్రతినిధి వేసవి కాలంలో ఎక్కువ సంఖ్యలో చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని విస్తృత స్థాయిలో మొక్కలు నాటాలని, పారిశు ధ్యాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని తెలిపారు. పారిశుధ్య చర్యలతో సీజనల్ వ్యాధులను తగ్గించవచ్చని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్ వరకు విస్తరించనున్నట్లు, పాఠశాల విద్యార్థులకు అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించ నున్నట్లు చెప్పారు. వికలాంగ విద్యార్థులకు బ్యాటరీ ఆధారిత వాహనాల పంపిణీ కార్యక్రమాన్ని కూడా త్వరలో ప్రారంభించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.అంతకు ముందుకు ఖమ్మం జిల్లా స్థాయి శాఖల అధికారులు పలు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజలు లబ్ధిపొందుతున్న వివరాలను వెల్లడించారు. రాబోయే ప్రభుత్వ పథకాలను ప్రజలకు కలెక్టర్ సంపూర్ణంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మున్సిపల్ చైర్‌పర్సన్‌లు, గ్రామ సర్పంచ్ లు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




అక్షరకలం
తెలుగు దినపత్రిక

ఆట



# ఐపీఎల్ 2027లో ధోనీ ఆడటం కష్టమేనా?





ఐపీఎల్ క్రికెట్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ఫ్యాన్స్‌కు ఎంఎస్ ధోనీ అంటే ఒక ప్లేయర్ మాత్రమే కాదు, అతను ఒక ఎమోషన్. ఈ 2026 సీజన్‌లో ధోనీని మైదానంలో చూడాలి అని ఎంతో మంది ఆశపడ్డా, గాయం కారణంగా ఒక్క మ్యాచ్‌లోనూ బ్యాట్ పట్టలేదు. దీంతో అభిమానులు తీవ్ర నిరాశలో మునిగిపోయారు. అయితే సోమవారం రాత్రి చెపాక్ మైదానంలో ఒక అద్భుతమైన సీన్ హైలెట్ అయ్యింది. మ్యాచ్ ముగిసిన తర్వాత ధోనీ గ్రౌండ్‌లోకి అడుగు పెట్టడంతో స్టేడియం మొత్తం మారుమోగిపోయింది. కానీ అదే సమయంలో ఆయన తన ప్రాణ స్నేహితుడు, మాజీ సహచరుడు సురేష్ రైనాతో అన్న కొన్ని మాటలు ఇప్పుడు ఫ్యాన్స్ గుండెల్ని పిండేస్తున్నాయి. సోమవారం రాత్రి చెన్నైలోని చేపాక్ స్టేడియంలో సన్ రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య కీలక మ్యాచ్ జరిగింది. ఈ హోరాహోరీ పోరులో చెన్నై జట్టు 5 వికెట్ల తేడాతో ఎస్ఆర్‌హెచ్ చేతిలో ఓటమి పాలైంది. ఈ ఓటమితో ఫ్యాన్స్ నిరాశ చెందినప్పటికీ, మ్యాచ్ ముగిసిన తర్వాత వాళ్లకు ఒక పెద్ద సర్ ప్రైజ్ దొరికింది. ఈ సీజన్‌లో హోమ్ గ్రౌండ్‌లో సీఎస్‌కేకి ఇదే ఆఖరి మ్యాచ్ కావడంతో, ఎంఎస్ ధోనీ మైదానంలోకి వచ్చారు. టీమ్ మెంబర్స్‌తో కలిసి ఫోటోలు దిగడమే కాకుండా, స్టేడియం మొత్తం చుట్టూ తిరుగుతూ అభిమానులకు అభివాదం చేశారు. ఈ ల్యాప్ ఆఫ్ ఆనర్ చూస్తుంటే ధోనీ ఇక క్రికెట్‌కు పూర్తిగా గుడ్ బై చెప్పేస్తున్నారా అన్న అనుమానాలు ఫ్యాన్స్‌లో మొదలయ్యాయి. ఈ మ్యాచ్‌కు కామెంటేటర్‌గా వచ్చిన సురేష్ రైనా, గ్రౌండ్‌లో ధోనీని కలిసి కాసేపు ముచ్చటించారు. ఈ ఇద్దరు దిగ్గజాలు చెన్నై జట్టుకు ఎన్నో గొప్ప విజయాలు అందించారు. ఈ సందర్భంగా రైనా ఐపీఎల్ 2027లో ఆడటం గురించి ధోనీని అడిగారు. ఆ సంభాషణ వివరాలను రైనా స్వయంగా వెల్లడించారు. "నేను ధోనీతో అన్నాను.. నువ్వు ఐపీఎల్ 2026కి ఎలాగో మిస్స్ డ్ కాల్ ఇచ్చావు కాబట్టి ఇది కౌంట్ అవ్వదు, నువ్వు కచ్చితంగా వచ్చే ఏడాది ఆడాల్సిందే అని చెప్పాను. దానికి ధోనీ స్పందిస్తూ.. నా శరీరం ఇప్పుడు కొంచెం బలహీనపడింది, మునుపటిలా సహకరించడం లేదు అని అన్నాడు" అని రైనా చెప్పారు. ధోనీ నోటి నుంచి ఈ మాట వినడంతో అభిమానులు ఎమోషనల్ అవుతున్నారు. ధోనీ ఆ మాట అన్నప్పటికీ రైనా మాత్రం వదిలి పెట్టలేదు. "నువ్వు ఏం చెప్పినా మేము నమ్మం, వచ్చే ఏడాది నువ్వు ఖచ్చితంగా గ్రౌండ్‌లోకి రావాల్సిందే అని నేను ధోనీతో గట్టిగా చెప్పాను" అని రైనా నవ్వుతూ గుర్తు చేసుకున్నారు. అయితే వచ్చే ఏడాది ఆడాలా వద్దా అనేది పూర్తిగా ధోనీ వ్యక్తిగత నిర్ణయం అని, ఆయన ఎప్పుడూ పాజిటివ్‌గానే ఆలోచిస్తారని రైనా ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం టీమ్‌లోని యువ ఆటగాళ్లతో ధోనీ మంచి అనుబంధాన్ని కలిగి ఉన్నారని, ఆయన జట్టుతో కలిసి ప్రయాణించడం ప్లేయర్స్‌లో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని నింపుతోంది అని రైనా వివరించారు. మ్యాచ్ ముగిసిన తర్వాత జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో సీఎస్‌కే హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్‌కు కూడా ధోనీ భవిష్యత్తుపైనే ప్రశ్నలు ఎదురయ్యాయి. దీనిపై ఫ్లెమింగ్ స్పందిస్తూ వచ్చే సీజన్‌లో ధోనీ ఉంటారా లేదా అనేది పూర్తిగా ఫ్రాంచైజీ మేనేజ్‌మెంట్ తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది అని చెప్పారు. "ధోనీ ఈ ఏడాది మ్యాచ్‌లు ఆడకపోయినా జట్టుతోనే ఉన్నాడు. యువ ఆటగాళ్లకు గైడెన్స్ ఇవ్వడంలో ఆయన పాత్ర చాలా పెద్దది. టీమ్‌పై ఆయన ప్రభావం ఎప్పుడూ ఉంటుంది. అయితే వచ్చే ఏడాది ఆడే విషయం మాత్రం మేనేజ్‌మెంట్ చూసుకుంటుంది, నా చేతుల్లో ఏమీ లేదు" అని ఫ్లెమింగ్ క్లారిటీ ఇచ్చారు. చెన్నై సూపర్ కింగ్స్ ప్రస్తుతం ఒక మార్పు దశలో ఉంది. ధోనీ స్థానాన్ని భర్తీ చేసేలా భవిష్యత్తు తరాల కోసం కొత్త ఆటగాళ్లను జట్టులోకి తీసుకుంటున్నామని ఫ్లెమింగ్ చెప్పారు. "మేము ఈ సీజన్‌లో కొంతమంది కొత్త ప్లేయర్స్‌ను ఇంట్రడ్యూస్ చేశాము. వాళ్లు భవిష్యత్తులో సీఎస్‌కేకి కీలక ఆటగాళ్లు అవుతారని నమ్ముతున్నాము. క్రికెట్‌లో ఫలితాలను బట్టే జడ్జ్ చేస్తారు అనేది నిజం, కానీ జట్టు భవిష్యత్తు కూడా మాకు ముఖ్యమే" అని కోచ్ అభిప్రాయపడ్డారు. ధోనీ లేకపోయినా జట్టును బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు ఆయన మాటలను బట్టి అర్థమవుతోంది. ఎంఎస్ ధోనీకి ప్రస్తుతం 44 ఏళ్ల వయసు ఉంది. ఈ వయసులో ప్రొఫెషనల్ క్రికెట్ ఆడటం, అందులోనూ వికెట్ కీపింగ్ చేయడం అంత సులభం కాదు. ఈ సీజన్‌లో ఆయన గాయం కారణంగా ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోవడానికి కారణం కూడా ఇదే. శరీరం సహకరించడం లేదు అని ధోనీ స్వయంగా ఒప్పుకోవడం చూస్తుంటే, ఆయన ఐపీఎల్ కెరీర్ ముగింపు దశకు వచ్చేసింది అని స్పష్టమవుతోంది. వచ్చే ఏడాది ఐపీఎల్‌లో మెగా వేలం ఉండటంతో, చెన్నై జట్టు ధోనీని ప్లేయర్‌గా రిటైన్ చేసుకుంటుందా లేదా అనేది ఇప్పుడు పెద్ద సస్పెన్స్‌గా మారింది.




# సంజు శాంసన్ సరికొత్త రికార్డు

ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో మహేంద్ర సింగ్ ధోని సుదీర్ఘకాలంగా ఏలుతున్న ఒక అరుదైన రికార్డుల లిస్టులో సంజు శాంసన్ తన పేరును లిఖించుకున్నాడు. సోమవారం చెపాక్ స్టేడియం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్ ఈ అద్భుతమైన ఘనత సాధించాడు. ఒకే ఐపీఎల్ సీజన్ లో సీఎస్‌కే తరపున ఒక వికెట్ కీపర్ గా అత్యధిక పరుగులు చేసిన ఎంఎస్ ధోని రికార్డును ఆయన బద్దలు కొట్టాడు. ఇంతకుముందు ధోని 2013 ఐపీఎల్ సీజన్ లో 16 ఇన్నింగ్స్ ఆడి 461 పరుగులు సాధించాడు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక



సినిమా
CINEMA




# పల్లెటూరి ప్రేమకథ దూరదర్శిని

ప్రస్తుత కాలంలో సినిమా విజయాన్ని బడ్జెట్ నిర్ణయించడం లేదు, కేవలం కంటెంట్ మాత్రమే శాసిస్తోంది. బలమైన కథాంశంతో వస్తున్న చిన్న చిత్రాలు కూడా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను సాధిస్తూ సంచలనం సృష్టిస్తున్నాయి. సరిగ్గా అదే బాటలో, కేవలం కథనే నమ్ముకుని ఈ వారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిత్రం 'దూరదర్శిని'. టైటిల్‌తోనే సగటు ప్రేక్షకుడిలో పాత జ్ఞాపకాలను తట్టిలేపిన ఈ సినిమా, థియేటర్లలో సందడి చేస్తోంది. చిత్ర కథ మట్టపర్రు అనే పచ్చని పల్లెటూరి చుట్టూ తిరుగుతుంది.



# మెగాస్టార్ చిరంజీవి హీరోగా 158వ చిత్రం

## క్లాప్ కొట్టిన తమ్ముడు పవన్ కళ్యాణ్

మెగాస్టార్ చిరంజీవి హీరోగా 158వ చిత్రం గురువారం మొదలైంది. కె.ఎస్.రవీంద్ర (బాబీ కొల్లి) దర్శకత్వంలో కె.వి.ఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై కె. నారాయణ నిర్మిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోలో పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ క్లాప్ కొట్టారు. చిరంజీవి కుమార్తె సుస్మిత కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు వి.వి.వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. అయితే ఈ సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆసక్తికర విషయాలు చోటు చేసుకున్నాయి. అన్నపూర్ణ స్టూడియోకు చిరంజీవి, తన సోదరుడు పవన్‌కల్యాణ్ ఒకే కారులో వచ్చారు. తదుపరి నాగబాబు జాయిన్ అయ్యారు. ముగ్గురు కలిసి ఒకే సోఫాలో కూర్చుని చక్కగా ముచ్చటించుకున్నారు. చిరంజీవి పక్కన ఉన్నంత సేపు పవన్ ఎంతో వినయంగా ఉన్నారు. ఈ దృశ్యాన్ని చూసి అభిమానులు సంబరపడిపోయారు. చాలాకాలం తర్వాత ముగ్గురు సోదరులను ఒకే వేదికపై చూడటం కనుల విందుగా ఉందంటూ కామెంట్స్ చేస్తున్నారు. అలాగే చిరంజీవి, పవన్ కల్యాణ్, రామ్‌చరణ్ ఫొటోలను చిత్రించిన పట్టు శాలువాతో చిరంజీవిని సన్మానించింది చిత్ర బృందం. మరో ఆసక్తికర విషయం ఏంటంటే.. పవన్‌కల్యాణ్‌కి భక్తుడైన బండ్ల గణెశ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బండ్లను చూడగానే పవన్ దగ్గరకు తీసుకుని భుజంపై చేయి వేసి మాట్లాడుతూ లోపలికి తీసుకెళ్లారు. ఆ కాసేపు బండ్ల మొహం హై వోల్టేజ్ బల్బ్‌లా వెలిగిపోయింది. ఎప్పటిలాగే వినయంగా చేతులు కట్టుకుని మాట్లాడారు బండ్ల గణెశ్. చిరంజీవి సైతం బండ్లను హత్తుకున్నారు. అభిమానులు మాత్రం 'బండ్లన్నకు ఇవాళ పండగే.. ఆయన అభిమానించే హీరోలతో సరదాగా కాసేపు ముచ్చటించారు. ఈ రోజు ఆయనకు నిద్ర పట్టదేమో' అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి అనశ్వర రాజన్ కూడా హాజరయ్యారు. ఈ చిత్రంలో ఆమె చిరుకు కుమార్తెగా కనిపించనున్నట్లు టాక్ నడుస్తోంది.

# 23న భోపాల్‌లో పెద్ది సందడి

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న చిత్రం 'పెద్ది'. జూన్ 4న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రముఖ నగరాల్లో దీని స్పెషల్ ఈవెంట్‌ను నిర్వహించాలని టీమ్ భావిస్తోంది. తాజాగా ముంబయిలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరిగిన విషయం తెలిసిందే. దీని తర్వాత మే 23న మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఏఆర్ రెహమాన్‌తో లైవ్ కాన్సర్ట్‌ను నిర్వహించనున్నారు. భారీ స్థాయిలో జరగనున్న ఈ ఈవెంట్ కోసం టీమ్ పనులు ప్రారంభించింది. తాజాగా భోపాల్‌లోని బీహెచ్‌ఈఎల్ గ్రౌండ్స్‌లో పూజా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇప్పటికే 'పెద్ది'నుంచి వచ్చిన రెండు పాటలు సూపర్ హిట్‌గా నిలిచి కోట్లలో వ్యూస్‌ను సొంతం చేసుకున్నాయి. ఇప్పుడు స్పెషల్ సాంగ్ రానుండడంతో అందరిలో ఆసక్తి నెలకొంది. 'పెద్ది'లో స్పెషల్ సాంగ్ హైలైట్‌గా నిలుస్తుందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో బుచ్చిబాబు తెలిపారు. ఆ పాట ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ బ్లాస్ట్ అని పేర్కొన్నారు. ఇక తాజాగా విడుదలైన 'పెద్ది' ట్రైలర్ అన్ని భాషల్లో కలిపి 63 మిలియన్ల వ్యూస్ వచ్చినట్లు టీమ్ తెలిపింది. అన్ని సోషల్ మీడియా వేదికల్లోనూ అది ట్రెండింగ్‌లో ఉందని పేర్కొంది. రామ్‌చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్ నటిస్తోన్న ఈ సినిమాలో శివరాజ్ కుమార్, జగపతి బాబు కీలకపాత్రల్లో కనిపించనున్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# ప్రభుత్వానికి రైతుల కష్టాలు కనిపించడం లేదా.?

బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు టీవీఎన్ రెడ్డి



అక్షరకలం దేవరకొండ

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల కష్టాలు కనిపించడం లేదా అని బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు టీవీఎన్ రెడ్డి తీవ్రంగా ధ్వజమెత్తారు. వరి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడుతున్న ఇబ్బందులపై దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పిలుపు మేరకు, దేవరకొండ మండలం కమలాపురం కొనుగోలు కేంద్రం వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఒక నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో టీవీఎన్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ... కళ్లాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగకపోవడం వల్ల అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి కళ్లల్లో కన్నీరు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా రైతులను ఘోరంగా మోసం చేసిందని మండిపడ్డారు. రైతు బతికితేనే రాష్ట్రం బతుకుతుంది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక పాలనకు రాబోయే రోజుల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారు. రాష్ట్రంలో రైతుల పక్షాన నిలబడి పోరాడుతున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. రైతుల సమస్యలు తీరే వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాశిరెడ్డి రవీందర్ రెడ్డి, రేపాని ఇద్దయ్య, జైహింద్ రెడ్డి, యాదయ్య, శ్రీను తదితరులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# సీఎం సహాయనిది పేదలకు వరం



అక్షర కలం,(చౌటుప్పల్):

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మునుగోడు నియోజకవర్గ శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని గుజ్జ గ్రామానికి చెందిన దోటి రామచంద్రయ్య కి 60,000, వసుకుల గాలయ్య కి 56,000, వేల రూపాయలు షేక్ ఇమాంబి కి 10,500, బొల్లం సుగుణ,కి 50,500,దోటి సునీత కి 60,000, గంగాదేవి భారతమ్మ కి 39,000,రూపాయల సీఎం సహాయనిధి చెక్కులను అందించారు.ఈ కార్యక్రమంలో గుజ్జ గ్రామ సర్పంచ్ ఎర్ర కవిత సైదులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజగోపాల్ రెడ్డి, నాపై అసత్య ప్రచారాలు చేస్తే ఖబడ్దార్ -- పబ్బు రాజు గౌడ్

అక్షరకలం చౌటుప్పల్

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో పాటు తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలపై కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు, ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చౌటుప్పల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడారు. రాజగోపాల్ రెడ్డిని రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము లేకే బిఆర్ఎస్ నాయకులు ఇలాంటి అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఒక బీసీ బిడ్డ కష్టపడి ఎదిగి, సొంతంగా కారు కొనుక్కుంటే కూడా ఓర్వలేకపోతున్నారని, బీఆర్ఎస్ నాయకుల కుటిల బుద్ధిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ అయిన బీఆర్ఎస్ నాయకులకు అంతా అవినీతిలాగే కనిపిస్తుందని ఎద్దేవా చేశారు. తమపై చేసిన ఆరోపణలకు ఆధారాలు ఉంటే బహిరంగ చర్చకు



రావాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షులు సుర్వి నర్సింహగౌడ్, మండల అధ్యక్షులు బోయ దేవేందర్ తదితర కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# దళితుల దశాబ్దాల నిరీక్షణకు మోక్షం లభించేనా.?

## నేడు సిఎం రేవంత్ రెడ్డి యాదాద్రి టూర్

## ఆ '5' సమస్యలకు పరిష్కారం దొరికేనా.?

## రూ. 100 కోట్ల శంకుస్థాపనల వేళ.. తమ గోడు వినాలంటున్న జిల్లా దళిత సంఘాలు

## సీఎం ప్రత్యేక దృష్టి సారిస్తారా?

అక్షరకలం యాదాద్రి భువనగిరి

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శనివారం యాదాద్రి భువనగిరి జిల్లాలో పర్యటించనున్నారు. యాదగిరిగుట్టలో సుమారు రూ. 100 కోట్ల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. ఈ పర్యటన నేపథ్యంలో, జిల్లాలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న దళితుల సమస్యలకు మోక్షం లభిస్తుందని స్థానిక దళిత కుటుంబాలు, దళిత సంఘాల నాయకులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

### జిల్లాలో దళితులను వేధిస్తున్న ప్రధాన 5 సమస్యలు ఇవే...

యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామంలోని సర్వే నెంబర్ 851 లో గల 82 ఎకరాల 20 గుంటల భూమిని 1989లో అప్పటి ప్రభుత్వం భూమిలేని దళిత కుటుంబాలకు వ్యవసాయం కోసం కేటాయించింది. నాటి నుండి నేటి వరకు దళితులు ఈ భూమిని సాగు చేసుకుంటున్నారు, వారికి పాస్ బుక్కులు కూడా వచ్చాయి. కానీ, ఆ భూమిని ఇంతవరకు అధికారికంగా 'భాగ పంపిణీ' (పంపకాలు) చేయలేదు. భూమిపై సర్వ హక్కులు దళితులకే ఉన్నా, పంపిణీ జరగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. 2025 జూన్ నెలలో జరిగిన 'భూ భారతి రెవెన్యూ సదస్సు'లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ.. ఎస్సీ, ఎస్టీ కమిషన్, జిల్లా కలెక్టర్, ఆర్డీవో కార్యాలయాల చుట్టూ తిరిగినా సమస్య ఇంకా పరిష్కారానికి నోచుకోలేదు.



మాసాయిపేట గ్రామాన్ని దత్తత తీసుకుని దళితుల సమస్యలను పరిష్కారం చేస్తానని సివిల్ రైట్స్ డే రోజున హామీ ఇచ్చిన కలెక్టర్ హనుమంతరావు

### ఫ్రీజ్ అయిన 'దళిత బంధు...

గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం కింద జిల్లాలోని మోత్కూరు, అడ్డగూడూరు మండలాలకు చెందిన సుమారు 254 మంది లబ్ధిదారులకు తలా రూ. 3 లక్షల చొప్పున 2023 అక్టోబర్‌లో గ్రామీణ వికాస్ బ్యాంక్



ఫ్రీజ్ ఐన దళిత బందు పథకం ను ఇప్పించాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ కు వినతి పత్రం ఇస్తున్న దళితులు



భువనగిరి లో శిధిలావస్థలో ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహం భవనం

ఖాతాల్లో జమ చేశారు. నిధులు జమ అయిన వెంటనే అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఆ ఖాతాలు ఫ్రీజ్ అయ్యాయి. దాంతో బాధితులు ఆ డబ్బులు డ్రా చేసుకోలేకపోయారు. ప్రభుత్వం మారిన తర్వాత కూడా ఎమ్మెల్యే, కలెక్టర్ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయింది.

### ఎస్సీ బాలికల వసతి గృహానికి నూతన భవన నిర్మాణం....

భువనగిరి జిల్లా కేంద్రంలోని గాంధీ నగర్‌లో (సర్వే నెంబర్ 6) సుమారు ఒక ఎకరం స్థలాన్ని 1970లో ఎస్సీ బాలికల హాస్టల్ కోసం కేటాయించారు. అందులో ఒక భవనాన్ని నిర్మించి 145 మంది విద్యార్థినులకు వసతి కల్పించారు. ప్రస్తుతం ఆ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో, విద్యార్థినులను ప్రైవేట్ అద్దె భవనంలోకి మార్చారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అదే స్థలంలో నూతన భవనాన్ని నిర్మించి, పేద ఎస్సీ బాలికలకు శాశ్వత వసతి కల్పించాలని విద్యార్థినులు డిమాండ్ చేస్తున్నారు.

### అట్రాసిటీ కేసుల రిలీఫ్ ఫండ్...

జిల్లాలో ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించిన రిలీఫ్ ఫండ్, పునరావాస చర్యలు గత ఐదు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా సుమారు 104 మంది బాధితులకు రూ. 62 లక్షల రిలీఫ్ ఫండ్ అందాల్సి ఉంది. గత ప్రభుత్వం కొన్ని పాక్షిక చర్యలు మాత్రమే చేపట్టి వదిలేసింది. సీఎం రేవంత్ రెడ్డి ఈ పర్యటనలోనైనా ఈ నిధులు విడుదల చేయాలని బాధితులు కోరుతున్నారు.

### సివిల్ రైట్స్ డే' నిర్వహణ...

గ్రామీణ ప్రాంతాల్లో వివక్ష, అంటరానితనం, మూఢనమ్మకాల నిర్మూలన కోసం ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ (పీసీఆర్ ) చట్టం 1955 ప్రకారం ప్రతి నెల చివరి రోజున ఎస్సీ కాలనీల్లో 'సివిల్ రైట్స్ డే' (పౌర హక్కుల దినోత్సవం) నిర్వహించాలి. ఈ సమావేశాలకు అధికారులు పూర్తి స్థాయిలో హాజరుకావడం లేదు. దీనివల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రాజ్యాంగ హక్కులపై దళితులకు అవగాహన కరువవుతోంది.

? ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీస్ అమెండ్మెంట్ యాక్ట్ (పిఓఏ)-2013 ను జిల్లాలో కఠినంగా అమలు చేయాలని, అలాగే ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించి దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని దళిత సంఘాల నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### ఆశాభావం...

సీఎం రేవంత్ రెడ్డి యాదాద్రి పర్యటన కేవలం శంకుస్థాపనలకే పరిమితం కాకుండా, దశాబ్దాలుగా నలుగుతున్న ఈ 5 ప్రధాన దళిత సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, తక్షణ పరిష్కారం చూపిస్తారని జిల్లా దళిత సమాజం ఎంతో ఆశతో ఎదురుచూస్తోంది.

# మహోన్నత వ్యక్తి పెన్న అనంతరామ శర్మ

--వారి ఆశయాలు ఆదర్శాలు నేటి యువతరానికి మార్గదర్శకం

--కమ్యూనిస్టులు లేకపోతే దేశానికి భవిష్యత్తు లేదు

---మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, జిల్లా కార్యదర్శి వీరారెడ్డి

ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం



సమ సమాజ స్థాపన కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు, స్వాతంత్ర సమరయోధులు పెన్నా అనంతరామ శర్మ అని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమరయ్య భవనములో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్యూనిస్టులకు ఇంకా భవిష్యత్తు లేదని కొందరు వాదిస్తున్నారని చెప్పారు. కమ్యూనిస్టులు లేకపోతే దేశానికి భవిష్యత్తు లేదని అన్నారు. అనంత రామ శర్మ ఆదర్శ కమ్యూనిస్టుగా జీవించారని పేర్కొన్నారు. నిరంతరం పేదల హక్కుల కోసం పోరాడిన అనంతరామ శర్మ గారు మన మధ్య లేకపోవడం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని అన్నారు. ఆయనతో మాకు సన్నిహిత సంబంధం ఉందని, నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు పోరాడిన వ్యక్తి శర్మ అని పేర్కొన్నారు. పార్టీలో గ్రామస్థాయి నుంచి రాష్ట్ర కమిటీ సభ్యుడి వరకు పనిచేశారని గుర్తు చేశారు. కార్మిక ఉద్యమంలో అనేక యూనియన్లను నిర్మాణం చేయడంలో కీలకపాత్ర పోషించారని చెప్పారు. పాలకులు రాజకీయాలను కలుషితం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.నేటి రాజకీయాలు కలుషితమయ్యాయని నేటి నాయకులు స్వార్థ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. కేంద్రంలో ఉన్న బిజెపి, రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ప్రజలకు చేసిన వాగ్దానాలను విస్మరించారని పేర్కొన్నారు. ప్రభుత్వాలు చేస్తున్న మోసపూరిత ప్రకటనలపై నేటి యువత ఆయన చూపిన అడుగుజాడల్లో పనిచేయాలని సూచించారు. వారి ఆశయాలు ఆదర్శాలు నేటి యువతరానికి మార్గదర్శకం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పాలడుగు నాగార్జున, సిహెచ్ లక్ష్మీనారాయణ, మహమ్మద్ సలీం, పుచ్చకాయలు నర్సిరెడ్డి, గంజి మురళీధర్, దండంపల్లి సత్తయ్య, బి పరిపూర్ణాచారి, నలుపు రాజు సైదులు, మన్నెం బిక్షం, రవీందర్, బొల్లు రవీంద్ర కుమార్, పోలే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

అక్షర కలం బీబీనగర్

మహిళ సాధికారతే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ మహిళల అభ్యున్నతికి కృషి చేయాలని సెట్విన్ కో- ఆర్డినేటర్ వనజ కోరారు. శుక్రవారం బీబీనగర్ మండలం గూడూరు గ్రామంలో గ్రామ సర్పంచ్ బింగి అలివేలు మంగ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహిళలకు సెల్ఫ్ ఎంప్లాయ్మెంట్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బింగి అలివేలు మంగ మాట్లాడుతూ మహిళలందరికీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యువజన సేవల సంస్థ ( డిపార్ట్మెంట్ ఆఫ్ యూత్ సర్వీసెస్) ద్వారా స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ఫర్ సెల్ఫ్ ఎంప్లాయ్మెంట్, అంశాల మీద మహిళలకు



అవగాహన సదస్సు నిర్వహిస్తుందని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ జాన సత్యనారాయణ, పాలకవర్గ సభ్యులు కసగోని అరుణ, బింగి లావణ్య, బాలప్రసాద్, అంకర్ల శ్రీనివాస్, గ్రామ మహిళా సంఘాల ప్రతినిధులు, విబికేలు, గ్రామంలోని మహిళలు పాల్గొన్నారు

# జంతుప్రాణ రక్షణలో అడ్డు రాని వయస్సు

--బసనబోయిన పున్నయ్య ఔదార్యం ప్రసంశనీయం - డా పెంటయ్య

అక్షరకలం కోదాడ

కోదాడ పట్టణం లో బసనబోయిన పున్నయ్య అనే ఒక వృద్ధ యజమాని కి చెందిన మూడు మాసాల వయస్సున్న కోడిపిల్ల ని ప్రమాదవశాత్తు, గేదె కాలితో తొక్కడంతో తొడ ఎముక విరిగింది.అది చూసిన వెంటనే ప్రేమతో సాకిన యజమాని హృదయం ద్రవించింది. తొంభై కి చేరువైన వయస్సు, నిప్పుల కొలిమిని తలపిస్తూ భగ్గున మండుతున్న



ఎండలు,కాలు బైటకు వేయాలంటేనే భయంతో వణికిపోతున్న జనాలు ... ఐనా వెరవకుండా తన కోడి పిల్లను కాపాడాలనే సంకల్పం ఆ వృద్ధుడిని మండుటెండలో అదీ కాలినడకన వైద్యం కోసం కోదాడ పశువైద్యశాలకు నడిపించింది. అకోడి పిల్లకి విరిగిన తొంటి ఎముకను పరీక్షించిన అసిస్టెంట్ డైరెక్టర్ డా. పి. పెంటయ్య కాలికి రెండు రాడ్ లు వేసి కాలుని అతికించి కోడి యజమాని కళ్లల్లో ఆనందాన్ని నింపారు.గత నాలుగు రోజులుగా ఎండలకు భయపడి జంతు యజమానులు పశువైద్యశాలకు రావడం తగ్గినా, తొంబయవ్వో సంవత్సరంలో ఉన్న యజమానికి జీవితం ఇచ్చిన ఎన్నో అనుభవాల సారం, పెంపుడు జంతువుల పైన పెంచుకున్న ప్రేమ మమకారమే మండుటెండలో సైతం వైద్యశాలకు వచ్చేలా చేసిందని జంతువులపై వారి ప్రేమ అభినందనీయం అని కొనియాడారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ప్రజల భాగస్వామ్యం అవసరం

### శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

### నల్గొండలో ఘనంగా 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' జిల్లా స్థాయి ముగింపు సదస్సు





ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం

ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ప్రజల భాగస్వామ్యం అవసరమని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ లో భాగంగా గురువారం నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని బైపాస్ వద్ద ఉన్న ఎంఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన జిల్లాస్థాయి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం సమాజంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నదని, ముఖ్యంగా రైతులకు రైతు బీమా, రైతు భరోసా అలాగే 6 గ్యారంటీల వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నది చెప్పారు. అయినప్పటికీ వివిధ రంగాలలో ఇంకా నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రైతులు పంటల మార్పిడికి వెళ్లాలని, దేశ,కాల , వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటలపై అవగాహన కల్పించుకోవాలన్నారు. రోజురోజుకు తగ్గిపోతున్న పశు సంపదను పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమస్యలు ఉత్పన్నం అయ్యేందుకు మనమే కారణం కావద్దని, సమస్యల పరిష్కారం పై లోతుగా ఆలోచించాలన్నారు. విద్య, సాగునీరు ,వైద్య రంగంలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యారంగ అభివృద్ధిలో భాగంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలతో పాటు, మోడల్ పాఠశాలలు ఏర్పాటు,విద్యార్థులకు యూనిఫామ్స్ ,మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నదని, అంతేకాక రానున్న విద్యా సంవత్సరం నుండి అల్పాహారం కూడా అందించనుందని తెలిపారు. ప్రతి జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేసినప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నదని ,ఈ విషయంపై దృష్టి సారించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. గ్రామాలలో పారిశుధ్యం కోసం ట్రాక్టర్లు ఏర్పాటు చేశామని, తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ చేయడం జరిగిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తున్నామని, జూన్ 2 నాటికి జిల్లాలో ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ ఇంకా పలు కార్యక్రమాలు. చేయాల్సి ఉందని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలు సంతోషంగా ఉన్నారని ఆయన తెలిపారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక ద్వారా అనేక కార్యక్రమాలను ప్రజల దగ్గరికి తీసుకు వెళ్ళినట్టు చెప్పారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక ప్రజల కార్యక్రమాలతో అంకితమైన కార్యక్రమం అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే కార్యక్రమాలను, త్వరలో అమలు చేయనున్న కొత్త పథకం కుటుంబ జీవిత బీమా పథకాన్ని వివరించారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అమలు చేయడంలో అధికారుల పాత్ర కీలకమన్నారు. ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నప్పటికీ ఇంకా సమస్యలు ఉన్నాయని, వాటిపై కూడా దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ మాట్లాడుతూ మార్చి 6న ప్రారంభమైన ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమాలను, సాధించిన విజయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ కార్యక్రమం తో పాటు, అలైవ్,అరైవ్, రోడ్డు భద్రత పై తీసుకున్న చర్యలను వివరించారు.ఈ సందర్భంగా వివిధ శాఖల జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె .శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేటర్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్యం కోసమే ఉచిత వైద్య శిబిరాలు



అక్షరకలం చిట్యాల

వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహిస్తున్న ఉచిత టీబీ వైద్య శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని చిట్యాల మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు కాటం వెంకటేశం పిలుపునిచ్చారు. శుక్రవారం చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీబీ హెల్త్ క్యాంప్‌ను కాట వెంకటేశం అధికారికంగా ప్రారంభించారు. ?ఈ సందర్భంగా సర్పంచ్ కాటం వెంకటేశం మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ వేముల వీరేశం సహకారంతో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలనే సంకల్పంతో ఈ ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రాణాంతకమైన టీబీ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ హెల్త్ క్యాంప్‌లో భాగంగా గ్రామానికి చెందిన సుమారు వంద మందికి టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అందులో నలుగురికి టీబీ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు వైద్యులు తెలిపారు. బాధితులకు వెంటనే వైద్య సిబ్బంది సమక్షంలో అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బొంగోని చెరువు సర్పంచ్ కట్ట ఆశయ, గ్రామ ఉప సర్పంచ్ ఓర్సు సైదులు, హెల్త్ సిబ్బంది చిత్తలూరు శ్రీను, అండాలు, ఏఎన్ఎంలు, తదితరు పాల్గొన్నారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ విప్



యాదాద్రి భువనగిరి అక్షర కలం

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టకు రానున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన ఏర్పాట్లను శుక్రవారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా సాగేందుకు అధికారులు చేపట్టిన ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్షా నిర్వహించారు. యాదగిరిగుట్ట టెంపుల్ సిటీ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, భద్రతా చర్యలు, పారిశుధ్య నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలను ఆయన పరిశీలించారు. అలాగే ముఖ్యమంత్రి రాక కోసం ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను సందర్శించి, అక్కడ చేపట్టిన వసతులు, సదుపాయాలను పరిశీలించారు. హెలిప్యాడ్ వద్ద భద్రతా ఏర్పాట్లను, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలకు సంబంధించిన మార్గదర్శకాలను అధికారులతో చర్చించి అవసరమైన సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర పవిత్ర పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రాకతో టెంపుల్ సిటీ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు చీర్ల అయిలయ్య, గుండ్లపల్లి హేమేంధర్, క్యాసగల్ల చందు తదితరులు పాల్గొన్నారు.

## భువనగిరిలో బెల్లి లలితక్క విగ్రహ ప్రతిష్ఠాపనకు స్థలం కేటాయింపు

అక్షరకలం యాదాద్రిభువనగిరి

మలిదశ తెలంగాణ ఉద్యమ గళం, 'తెలంగాణ గాన కోకిల' బెల్లి లలితక్క విగ్రహ ప్రతిష్టాపనకు భువనగిరి పట్టణంలో స్థలాన్ని అధికారికంగా కేటాయించారు. భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిల్ సంయుక్తంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. భువనగిరి పట్టణ నడిబొడ్డున ఉన్న రైతు బజార్ (కూరగాయల మార్కెట్) వద్ద, అమరవీరుల స్థూపం పక్కన అందరి ఆమోదంతో స్థలాన్ని ఖరారు చేశారు. మే 26న బెల్లి లలితక్క 27వ వర్ధంతిని పురస్కరించుకుని, అదే రోజున అత్యంత ప్రతిష్టాత్మకంగా విగ్రహ శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తన గళంతో ప్రజలను, యువతను చైతన్యపరిచిన లలితక్క సేవలు, ఆమె చేసిన ప్రాణ త్యాగం మరువలేనివని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కొనియాడారు. ఉద్యమ గడ్డపై లలితక్క విగ్రహ ప్రతిష్టాపనకు స్థలాన్ని కేటాయించడం పట్ల తెలంగాణ ప్రజలు, ఉద్యమకారులు, ప్రజా సంఘాల నాయకులు మరియు కళాకారులు ఎమ్మెల్యేకు, మున్సిపల్ కౌన్సిల్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విగ్రహ కమిటీ సమన్వయకర్తలు జన్ని వెన్నెల, సూర్య ప్రకాష్, మున్సిపల్ చైర్‌పర్సన్ తంగెళ్లపల్లి శ్రీవాణి, వైస్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, గ్రంథాలయ చైర్మన్ అవేస్ చిస్తి, స్థానిక కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు, పలు ప్రజాసంఘాల నాయకులు, బెల్లి లలితక్క అభిమానులు పాల్గొన్నారు.



## పాక కొమురయ్య యాదవ్ జ్ఞాపకార్థం సహృదయ వృద్ధాశ్రమంలో అన్నదానం



యాదాద్రి భువనగిరి అక్షర కలం

భువనగిరి మండలంలోని రాయగిరి లో గల సహృదయ వృద్ధాశ్రమం లో శుక్రవారం పాక కొమురయ్య యాదవ్ జ్ఞాపకార్థం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. భువనగిరి మండలం గౌస్ నగర్ కు చెందిన పాక కొమురయ్య గత నెల 22న మరణించారు. ఆయన జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సీనియర్ రిపోర్టర్ పాక జహంగీర్ యాదవ్-రేవతి దంపతులు ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాక జహంగీర్ మాట్లాడుతూ పుట్టినరోజు, పెళ్లిరోజు, జయంతి, వర్ధంతి రోజులలో అన్నదానం చేసి, పిల్లలకు, వృద్ధులకు, వికలాంగులకు, అనాథలకు అండగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాక కొమురయ్య కుటుంబ సభ్యులు పాక అండాలు బంధుమిత్రులు వల్లాల లింగయ్య యాదవ్, చుక్కల శంకరయ్య యాదవ్, శెట్టి సుప్రీం యాదవ్, కొండాపురం ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మూగజీవాల ప్రాణదాతలు...రైతుల ఆర్థిక బంధువులు "గోపాలమిత్రులు"

### మారుమూల గ్రామాల్లోనూ మరువని సేవలు

### శబాష్ అంటున్న పాడిరైతులు

అక్షరకలం నల్గొండ

జిల్లాలోని మారుమూల గ్రామాల్లో పశువైద్యం సకాలంలో అందని ప్రాంతాల్లో 'గోపాలమిత్రులు' అందిస్తున్న సేవలు పాడిరైతులకు కొండంత అండగా నిలుస్తున్నాయి. ఒకవైపు మారుమూల పల్లెల్లో సైతం తిరుగుతూ పశువులకు కృత్రిమ గర్భధారణ సేవలు అందిస్తూ పశుసంపద వృద్ధికి తోడ్పడుతున్నారు.?మరోవైపు ప్రస్తుత ఎండ తీవ్రతకు మూగజీవాలు నీరసించి, పాల దిగుబడి తగ్గి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉన్న తరుణంలో గోపాలమిత్రులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. మండల పశువైద్యాధికారి సలహాలు, సూచనలను పాటిస్తూ, అత్యవసర సమయాల్లోనూ, అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తక్షణమే స్పందించి ప్రాథమిక చికిత్సలు అందిస్తున్నారు.

### రైతులకు తప్పిన ఆర్థిక నష్టం...

గోపాలమిత్రుల సమయస్ఫూర్తి వల్ల ఎన్నో మూగజీవాల ప్రాణాలు కాపాడబడుతున్నాయి. దీనివల్ల పల్లెల్లో పాల దిగుబడి తగ్గకుండా ఉండటమే కాకుండా, రైతులు ఆర్థికంగా నష్టపోకుండా నిలదొక్కుకుంటున్నారు. నిరంతరం శ్రమిస్తూ, మూగజీవాల ప్రాణాలు కాపాడుతున్న గోపాలమిత్రుల సేవలను జిల్లా పాడిరైతులు అభినందిస్తున్నారు.



## అవుట్ సోర్సింగ్ పోస్టులకు దరఖాస్తులు

అక్షరకల నల్గొండ

నల్గొండ జిల్లాలోని తెలంగాణ మైనారిటీస్ గురుకుల విద్యాలయాలలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి టి. విజయేందర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకులాల్లో అన్ని సబ్జెక్టులకు సంబంధించి పీజీటీ, టీజీటీ, స్టాఫ్ నర్స్, జేఎల్ పోస్టులను అవుట్ సోర్సింగ్ పద్ధతిన భర్తీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా పాఠశాలలు, కళాశాలల్లో ఉన్న ఖాళీల ఆధారంగానే తుది నియామకాలు ఉంటాయని స్పష్టం చేశారు.

### అర్హత ప్రమాణాలు ఇవే...

అభ్యర్థుల వయస్సు 18 నుండి 44 సంవత్సరాల మధ్య ఉండాలి. సంబంధిత సబ్జెక్టులో 50 శాతం మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పీజీ) ఉత్తీర్ణులై ఉండాలి. దీనితో పాటు బీఈడీ పూర్తి చేసి ఉండటం తప్పనిసరి. జూనియర్ కళాశాలల్లో కనీసం మూడు సంవత్సరాల బోధనా అనుభవం కలిగి ఉండాలి.అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతలు, అనుభవానికి సంబంధించిన అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాల జిరాక్స్ నకళ్లతో కూడిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా సమర్పించాల్సి ఉంటుంది.నల్గొండ పట్టణంలోని క్లాక్ టవర్ సమీపంలో గల సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భవనంలో ఉన్న అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ " హెచ్-కంప్యూటర్ సర్వీసెస్ అండ్ మ్యాన్ పవర్ కన్సల్టెన్సీ" కార్యాలయంలో నేరుగా దరఖాస్తులను అందజేయాలి. 27 మే 2026 సాయంత్రం 5:00 గంటల లోపు వచ్చే దరఖాస్తులను మాత్రమే పరిశీలనలోకి తీసుకుంటామని, గడువు ముగిసిన తర్వాత వచ్చే వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబోమని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి స్పష్టం చేశారు.

## కౌమార బాలికల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం:

అక్షరకలం, చండూరు



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శుక్రవారం స్థానిక పి.ఆర్. గెస్ట్ హౌస్ నందు మెప్మా ఆధ్వర్యంలో 15 నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల కౌమార బాలికల కోసం ప్రత్యేక హెల్త్ స్క్రీనింగ్ క్యాంపును నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అధికారికంగా ప్రారంభించగా, మున్సిపల్ కమిషనర్ ఎల్. మల్లేశం మాట్లాడుతూ.. మానవ వికాస దశల్లో కౌమార దశ అత్యంత కీలకమైనదని, శారీరక, మానసిక మార్పులు సంభవించే ఈ సమయంలో బాలికలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సందర్భంగా వైస్ చైర్‌పర్సన్ భూతరాజు దశరథ, కౌన్సిల్ సభ్యులు తేలుకుంట్ల రాజకుమారి చంద్రశేఖర్, కటకం రమేష్ తదితరులు బాలికలకు పలు ఆరోగ్య సూచనలు చేశారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు బుషిపాక వాసు, కొన్రెడ్డి మధు, వైద్యాధికారులు డాక్టర్ రాజు, డాక్టర్ జెస్సి, మెప్మా టి.ఎమ్.సి ఎన్. సరితతో పాటు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఆర్పీలు మరియు స్థానిక బాలికలు పాల్గొన్నారు.

## అంటరానితనానికి వ్యతిరేకంగా భాగ్యరెడ్డి వర్మ పోరాటం.

జోగులాంబ గద్వాల జిల్లా అక్షర కలం ప్రతినిధి

అంటరానితనం, వివక్షకు వ్యతిరేకంగా భాగ్యరెడ్డి వర్మ పోరాటం చేశారని అదనపు కలెక్టర్ రెవిన్యూ మధుమోహన్ అన్నారు. శుక్రవారం దళిత వైతాళికుడిగా ప్రసిద్ధి చెందిన భాగ్యరెడ్డి వర్మ 138వ జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్ వద్ద ఆయన చిత్రపటానికి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నర్సింగరావుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరైన మధుమోహన్ మాట్లాడుతూ మహనీయుల జీవితం నుంచి స్ఫూర్తి పొందడానికి, వారు సమాజానికి చేసిన సేవలను గుర్తు చేసుకోవడానికి ప్రభుత్వం ఏటా భాగ్యరెడ్డి వర్మ లాంటి గొప్ప వారి జయంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. భాగ్యరెడ్డి వర్మ హైదరాబాదు సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి వారి అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. మనదేశంలో కులవివక్షను ఎదుర్కొని గొప్ప స్థాయికి చేరుకున్న మహనీయులు ఎందరో ఉన్నారని, వారిలో భాగ్యరెడ్డి వర్మ ఒకరని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత, బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ బాషా, సర్వే ఏడి నూకరాజు, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మరికల్ ఎస్ హెచ్ ఓ గా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై ఏ. విక్రమ్

(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, మే,22)




నారాయణపేట జిల్లా మరికల్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ (స్టేషన్ హౌస్ ఆఫీసర్)గా ఎస్ఐ ఏ. విక్రమ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు మరికల్ ఎస్సైగా విధులు నిర్వహించిన రాములు నగర్ కర్నూలు జిల్లా తడూరు పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై విక్రమ్ జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ గారిని ఎస్పీ కార్యాలయంలో పూల మొక్క అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ నూతన ఎస్సైకి శుభాకాంక్షలు తెలియజేసి మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై విక్రమ్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ స్నేహపూర్వక పోలీసింగ్ అమలు చేస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి సమస్యలైనా నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి తెలియజేయాలని సూచించారు. గ్రామాల్లో అక్రమ కార్యకలాపాలు, మత్తు పదార్థాల వినియోగం, పేకాట, గంజాయి రవాణా, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు. మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, యువత చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ తెలిపారు.

# కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలి..

### కుటుంబ సమస్యలతోనే కేటీఆర్ అసహనంగా మాట్లాడుతున్నారు..

### రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..

జగిత్యాల మే 22:(అక్షర కలం)

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ , మాజీ మంత్రి కుటుంబ సమస్యలతోనే అసహనంగా మాట్లాడుతున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లాలో నిర్వహించిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో మంత్రి అడ్లూరి శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ కేటీఆర్ కుటుంబంలో కవిత ఒకవైపు, కుర్చీ లాక్కునే ప్రయత్నం బావ ప్రయత్నించడంతో కేటీఆర్ నిత్యం అసహనానికి గురవుతున్నారని మంత్రి అడ్లూరి అన్నారు.




బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని లేదంటే రాష్ట్రంలోని 33 జిల్లాల్లోని కాంగ్రెస్ కార్యకర్తలు బుద్ధి చెప్పే పరిస్థితి వస్తుందని మంత్రి అడ్లూరి అన్నారు. రాజ్యాంగ ప్రకారం ఎన్నికైన ముఖ్యమంత్రి ని ఏకవచనంతో మాట్లాడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీని రాష్ట్రంలో ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదని ఆయన అన్నారు. మరో 20 ఏళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని మంత్రి అడ్లూరి అన్నారు. కేటీఆర్ తల కిందికి.. కాళ్లు పైకి పెట్టిన రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాదని మంత్రి జోస్యం చెప్పారు.నాడు సీఎంగా ఉన్న కేసీఆర్ ను ఏనాడు వ్యక్తిగతంగా కాంగ్రెస్ పార్టీ మాట్లాడలేదని మంత్రి గుర్తు చేశారు. ముఖ్యమంత్రి పై మాట్లాడితే గొప్ప వాడివి కావని మంత్రి అడ్లూరి అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న టిఆర్ఎస్ పార్టీ ఎస్సీ, బీసీ మైనార్టీల సంక్షేమం మరిచిందని మంత్రి అడ్లూరి అన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్ లో ఉన్న ఎస్సీ, బీసీ, మైనార్టీల బిల్లులు రూ. వెయ్యి కోట్లు చెల్లించిందని మంత్రి తెలిపారు.

# పర్యాటక శోభ సంతరించే విధంగా పటిష్ట చర్యలు.... - కలెక్టర్ ప్రతిమాసింగ్...,.

మెదక్/ కొల్చారం మే22(అక్షరకలం):-




పర్యాటక వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల నేపథ్యంలో శుక్రవారం ఉదయం మెదక్ దాయార పురాతన కట్టడాలైన బావి, దేవాలయాలు సందర్శించిన జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ , అదనపు కలెక్టర్ నగేష్, మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, మెదక్ ఆర్డీవో రమాదేవి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు యువత,ఇతర ప్రజాప్రతినిధులు గ్రామస్తులతో కలిసి జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలోని పర్యాటక శోభ సంతరించే విధంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి పర్యాటక ప్రాంతాలను తుది రూపు తీసుకువచ్చే విధంగా పర్యాటక పురావస్తు శాఖ అధికారుల సమన్వయంతో మౌలిక వసతులు కల్పనపై పటిష్ట చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు.

# వరి ధాన్యాన్ని నిబంధనల ప్రకారం నిల్వ చేయాలి.. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 22:

రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం గోదాములు, రైస్ మిల్లులలో నిబంధనల ప్రకారం నిల్వ చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ మండలం కేంద్రంలో గల స్టేట్ వేర్ హౌస్ కార్పొరేషన్ గోదామును మండల తహశీల్దార్ సంతోష్ తో కలిసి సందర్శించి ధాన్యం నిల్వ ప్రక్రియను పరిశీలించారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని తెలిపారు. గోదాములకు తరలించిన ధాన్యం దిగుమతిలో ఆలస్యం లేకుండా వేగంగా పూర్తి చేయాలని, అవసరం మేరకు హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని తెలిపారు. జైపూర్ మండలం ముదిగుంటలో గల బిఎస్ వై రైస్ మిల్, ఇందారంలో గల వరలక్ష్మీ రైస్ మిల్ లను మండల తహశీల్దార్ వనజ రెడ్డి తో కలిసి సందర్శించి ధాన్యం ప్రక్రియను పరిశీలించారు.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం

## - రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి ;

(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, మే,22)




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక -- 99 రోజుల యాక్షన్ ప్లాన్" లో భాగంగా నారాయణపేట జిల్లా గాయత్రి ఫంక్షన్ హాల్, నారాయణపేటలో జిల్లా సంక్షేమ శాఖ మరియు తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లాకు చెందిన దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరవ మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి , విశిష్ట అతిథిగా తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ శ్రీ ముత్తినేని వీరయ్య , జిల్లా కలెక్టర్ శ్రీమతి సి. హెచ్. ప్రియాంక , అదనపు కలెక్టర్ శ్రీ ఎస్. శ్రీను , మక్తల్, నారాయణపేట, మద్దూర్, కోస్గి మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులు మరియు దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సాధికారత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అతిథులు ప్రశంసించారు. ప్రత్యేకంగా దివ్యాంగుల స్వయం ఆధారిత జీవనానికి దోహదపడే విధంగా రిట్రోఫిటెడ్ మోటార్ వాహనాలు (34), బ్యాటరీ వీల్ చైర్ ట్రైసైకిల్ -- 10, టలాప్టాప్ (08) , చెవి వినికిడి యంత్రాలు (2 )లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌరవ మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి మాట్లాడుతూ దివ్యాంగుల అభివృద్ధి మరియు సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. కొత్త ఆలోచనలు, కొత్త అవకాశాలు దివ్యాంగుల జీవితాల్లో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నాయని పేర్కొన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి పెద్దన్నలా, ఆత్మీయ బంధువులా అండగా నిలుస్తున్నారని తెలిపారు. అలాగే తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం దివ్యాంగుల సంక్షేమానికి ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇద్దరు దివ్యాంగులు వివాహం చేసుకుంటే కల్యాణ లక్ష్మి పథకంతో పాటు అదనంగా రూ.2 లక్షల వివాహ ప్రోత్సాహక బహుమతి అందిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే ఐదు సంవత్సరాల లోపు దివ్యాంగ చిన్నారులకు శస్త్ర చికిత్సలు నిర్వహించి సాధారణ జీవితం గడిపేలా చేయడం కోసం "బాల భరోసా" కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. దివ్యాంగుల కోసం ప్రభుత్వం అందిస్తున్న సహాయ ఉపకరణాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులైన దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ శ్రీమతి సి. హెచ్. ప్రియాంక మాట్లాడుతూ దివ్యాంగ మహిళలు ప్రభుత్వం అందిస్తున్న ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే దివ్యాంగులకు అవసరమైన సహాయ సహకారాలు ప్రభుత్వం తరఫున అందించబడతాయని తెలిపారు. దివ్యాంగ మహిళలు తప్పనిసరిగా సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌లలో చేరాలని కోరారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఎల్. రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ దివ్యాంగులకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అర్హులైన ప్రతి దివ్యాంగునికి సహాయ పరికరాలు అందజేస్తామని, ఇప్పటివరకు పొందని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎస్. శ్రీను , ఆర్డీవో ఎల్. రమేష్ , డీపీవో సుధాకర్ రెడ్డి , ఇతర జిల్లా అధికారులు మరియు ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ సాయి , లబ్ధిదారులు, దివ్యాంగులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది.....

### - జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్.....

మెదక్/ కొల్చారం మే 22(అక్షరకలం):-



ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావొద్దని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. శుక్రవారం చేగుంట మండలం రెడ్డిపల్లి లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, జనగణన సర్వే ను పరిశీలించారు .ప్రభుత్వం రైతుల నుంచి ప్రతి గింజను కొనుగోలు చేయడానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.రైతులు ఎలాంటి అపోహలు, ఆందోళనలు పెట్టుకోవద్దని, ప్రభుత్వం పూర్తిస్థాయిలో వారి పక్షాన నిలుస్తుందని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, సకాలంలో జరుగుతుందని తెలిపారు. ధాన్యం త్వరగా మిల్లులకు తరలించాలన్నారు. ట్రక్ తో కేంద్రానికి సంబందించిన ఎవరో ఒకరు తప్పకుండ వెళ్లి అన్ లోడింగ్ త్వరగా అయ్యేలా పర్యవేక్షణ చేయాలన్నారు. ట్యాబ్ ఎంట్రీ ఎప్పటికప్పుడు చేస్తే రైతుల ఖాతా లో నగదు జమ ఆలస్యం కాదన్నారు రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు ప్రభుత్వం చేస్తున్నదని ఆమె వివరించారు. రైతుల సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టంచేశారు. పకడ్బందీగా జనగణన చేపట్టాలని, ఇండ్ల గణనలో సరిఅయిన సంఖ్యలను నమోదు చేయాలన్నారు. ఎన్యుమరేటర్లు ఏదైనా సమస్యలు తలెత్తితే ఉన్నతాధికారులకు సమాచారంఅ ందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జై చంద్రారెడ్డి,అధికారులు,స్థానిక తహసిల్దార్, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యాచరణను అందరి భాగస్వామ్యంతో అమలు

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 22:

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో ప్రజల భాగస్వామ్యంతో పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి గణపతి, ముఖ్య ప్రణాళిక అధికారి పాపయ్య, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, చెన్నూరు, బెల్లంపల్లి, క్యాతనపల్లి మున్సిపల్ చైర్ పర్సన్లు పద్మ, స్వాతి, సంధ్యారాణి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయడం జరుగుతుందని తెలిపారు. రెండు పడక గదుల ఇండ్లను అర్హత మేరకు లబ్ధిదారులకు లాటరీ పద్ధతిన పారదర్శకంగా కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన లబ్ధిదారులకు కేటాయించడం జరుగుతుందని, త్వరలో ప్రభుత్వం 2వ విడత ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. పింఛనుదారుల జీవన ప్రామాణికరణ ప్రక్రియ కొనసాగుతుందని, నూతన పింఛన్ల కొరకు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గృహజ్యోతి పథకంలో అర్హులైన లబ్ధిదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందని, ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదిగేందుకు వివిధ వ్యాపార రంగాలలో ఋణ సదుపాయం కల్పించి ప్రోత్సహించడం జరుగుతుందని, జిల్లా కేంద్రంలో ఇందిరా మహిళ శక్తి భవన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయని, త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందించి చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని, రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, అర్హులైన వారు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా రైతు భరోసా, రైతు బీమా పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతుందని, వ్యవసాయ సాగు ఉత్పత్తులకు మద్దతు ధర నిర్ణయించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి కొనుగోలు చేయడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తోడ్పాటు అందించడం జరుగుతుందని తెలిపారు. సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయల బోనస్ అదనంగా రైతులకు అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన లబ్ధిదారులు నిర్మించుకున్న ఇండ్లకు దశల వారీగా బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయని, ఎవరికైనా బిల్లులు పెండింగ్ లో ఉన్నట్లయితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువస్తే చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని, నిరుపేదలు గౌరవంగా జీవించడం కోసం ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తుందని తెలిపారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకంలో అర్హులైన లబ్ధిదారులకు నగదు అందించడం జరుగుతుందని తెలిపారు. వేసవిలో ప్రజలకు త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతరం సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, నీటి సరఫరా లో ఏదైనా సమస్య ఉన్నట్లయితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. విద్య రంగ అభివృద్ధి దిశగా ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని, ప్రాథమిక పాఠశాల నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు ఉదయం అల్పాహారం పథకం త్వరలో ప్రారంభించడం జరుగుతుందని, పిల్లలలో పోషకాహార లోపాన్ని నియంత్రించేందుకు ఈ పథకం అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని దండేపల్లి, చెన్నూరు మండలం సోమనపల్లి, బెల్లంపల్లి మండల కేంద్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను మంజూరు చేసి ఒక్కొక్క పాఠశాల 200 కోట్ల రూపాయల నిధులతో పనులు పురోగతిలో ఉన్నాయని, ఈ పాఠశాలల ద్వారా విద్యార్థులకు మరింత మెరుగైన, సౌకర్యవంతమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరికి బీమా సదుపాయం కల్పించేలా ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, దివ్యాంగుల సంక్షేమంలో భాగంగా దివ్యాంగులకు మోటరైజడ్ వాహనాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వ్యవసాయంలో పంట మార్పిడి విధానము ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించి వ్యాపార, వాణిజ్య పంటలతో పాటు కూరగాయల సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని, ఈ అంశాలపై రైతు వేదికల ద్వారా రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో బస్తీ దవాఖానాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ వైద్య కళాశాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని, ప్రజల సౌకర్యార్థం జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని, ఆయా ప్రాంతాలలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. జిల్లా సర్వతోముఖాభివృద్ధికి సమిష్టిగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955